




గోదారి పరుగులు : ధవళేశ్వరం బ్యారేజీ వద్ద సముద్రంలోకి విడుదల చేసిన నీరు

తూర్పు ఎస్పీగా నరసింహ కిషోర్

ప్రస్తుత ఎస్పీ జగదీశ్ బదిలీ



రాజమహేంద్రవరం, జూలై 13(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి ఎస్పీగా డి.నరశింహ కిశోర్ నియమితులయ్యారు.ఇప్పటి వరకూ ఎస్పీగా విధులు నిర్వర్తించిన పి.జగదీశ్‌ని డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాల్సిందిగా ఉత్తర్వులు విడుదలయ్యాయి.రాష్ట్రంలో 37 మంది ఐపీఎస్‌లకు స్థాన చలనం కలిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకొంది. 2013 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అయిన కిశోర్ తిరుమలలోని చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ అధికారిగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వస్తున్నారు. 2017 బ్యాచ్‌కి చెందిన జగదీశ్ గతేడాది సెప్టెంబరు 8న ఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు.చంద్రబాబు జైలులో ఉన్నప్పుడు..ప్రధాని పర్యటన.. సార్వత్రిక ఎన్నికల వంటి కీలక సమయాల్లో పటిష్ఠమైన భద్రత ఏర్పాట్లు చేసి సమర్థవంతమైన అధికారిగా పేరు తెచ్చుకున్నారు.ఎస్పీ జగదీశ్‌పై ఇసుక విషయంలో విమర్శలు ఉన్నాయి. అప్పటి కలెక్టర్ మాధవీలత వైసీపీ నాయకులకు కొమ్ముకాస్తూ ఇసుక డ్రెడ్జింగ్ జరగడం లేదని కోర్టుకు సమర్పించిన నివేదికలో ఆయన కూడా వాస్తవానికి విరుద్ధంగా ప్రవర్తించారనే ఆరోపణ ఉంది. ఎస్ఐల బదిలీల్లోనూ వైసీపీ నాయకుల మాట విని పోస్టింగ్‌లు ఇచ్చారని వినికిడి. ప్రజాప్రతినిధుల అభ్యర్థనకు నిఘా వర్గాల నివేదికకు పొంతన కుదరక పోవడమే బదిలీకి కారణంగా చెబుతున్నారు. జిల్లాకు వస్తున్న నరశింహ కిశోర్ వైసీపీ ప్రభుత్వంలో మంత్రిగా చేసిన ధర్మాన ప్రసాదరావుకు అతి భక్తుడని సమాచారం.



బొమ్మూరులో వాటర్ ట్యాంక్ వద్ద సూచనలు చేస్తున్న దినేష్‌కుమార్

ఓహెచ్ఆర్‌లు శుభ్రం చేసి ఫొటోలు అప్‌లోడ్ చేయండి

- 4 రోజుల పాటు ఉద్యోగులకు సెలవుల్లేవ్
- ఇన్‌చార్జి జేసీ దినేష్‌కుమార్ ఆదేశం

రాజమహేంద్రవరం, జూలై13(ఆంధ్రజ్యోతి)/రాజమహేంద్రవరం రూరల్ : జిల్లాలోని సీజనల్ వ్యాధులను వ్యాప్తి చెందకుండా చేయడానికి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాలలో శనివారండ్రైడే పాటించడంతో పాటు జిల్లా వ్యాప్తంగా అన్ని ఓహెచ్ఆర్‌లలోని నీటిని తీసేసి, క్లోరినేషన్ చేశామని జిల్లా ఇన్‌చార్జి జేసీ కె.దినేష్‌కుమార్ తెలిపారు. డ్రైడే నిర్వహణలో భాగంగా బొమ్మూరు, కడియం ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేసినట్టు తెలిపారు. జిల్లా స్థాయి,డివిజనల్, మండల స్థాయి అధికారుల తో క్షేత్ర స్థాయిలో పర్యటించి ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు దిశా నిర్దేశం చేసి నట్టు చెప్పారు. జిల్లాలోని వాటర్ ట్యాంకుల నిర్వహణ రిజిస్టర్‌లో క్లీనింగ్, క్లోరినేషన్ వివరాలు నమోదు చేయాలన్నారు. అన్ని ఓవర్‌హెడ్ ట్యాంకుల ఫొటోలు క్లీనింగ్‌కు ముందు, తర్వాత కూడా అప్‌లోడ్ చేయాలన్నారు. గ్రామాల్లో వాటర్ ట్యాంక్‌లను పూర్తిస్థాయిలో శుభ్రం చేసి చేసిన తర్వాత ప్రజలకు నీరు సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయనతో ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా అధికారులు, స్పెషల్ ఆఫీసర్లు ఆయా మండలాల్లో పర్యటిచారు.డీపీవో రాంబాబు నిడదవోలు తదితర ప్రాంతా ల్లో పర్యటించారు.రానున్న నాలుగు రోజుల పాటు జిల్లాలో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులెవరూ సెలవులు తీసుకోవద్దని ఆదేశించారు. ఇదిలా ఉండగా కడియం పర్యటనకు ఇన్‌చార్జి జేసీ వచ్చిన సమయంలో ఎంపీడీవో రాజ్‌మనోజ్, కడియం, వేమగిరి కార్యదర్శులు ఎం. శ్రీనివాసరెడ్డి, కేవీఎస్ఎస్ఎన్.రాజశేఖర్ హాజరుకాకపోవడంతో డీపీవో రాంబాబు షోకాజ్ నోటీస్ జారీ చేశారు.ఆయన వెంట ఇన్‌చార్జి ఆర్‌డీవో నాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ డి.బాల శంకరరావు, ఎంపీడీవో డి. శ్రీనివాస్ ఉన్నారు.

ముంచిన వాన



మొక్కలు బతికేనా : కడియం నర్సరీలో నీట మునిగిన మొక్కలు

రోడ్డేది : కొవ్వూరులో రహదారి గోతుల్లో నిలిచిన వాన నీరు

రోజంతా వదలని ముసురు

- స్తంభించిన జనజీవనం
- 19 మండలాల్లోనూ వాన
- పల్లపు ప్రాంతాలు జలమయం
- రోడ్లపై నిలిచిన నీరు
- ముంపులో వరి చేలు
- అన్నదాతల ఆందోళన
- చెట్టుపడి యువకుడి మృతి

రాజమహేంద్రవరం అర్బన్/కడియం, జూలై 13 : రోజంతా ముసురు వదల్లేదు. ఉదయం నుంచి రాత్రి వరకూ ఏకధాటిగా వాన పడుతూనే ఉంది. ఏ మాత్రం గ్యాప్ లేకుండా వర్షం కురవడంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా జిల్లాలోని పలు గ్రామాలు జలమయంగా మారాయి. చేలన్నీ నీట మునిగాయి. రోడ్లు, వీధులు వాన నీటితో నిండిపోయాయి. ధవళేశ్వరం నుంచి వయా వేమగిరి మీదుగా కాకినాడ వెళ్లే రహదారి భారీ గుంతలు ఉండడంతో పాటు ఆయా గుంతల్లో వర్షపు నీరు చేరి ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారింది. దీంతో ద్విచక్ర వాహనదారులు కారుల్లో ప్రయాణించే వారు అవస్థలు పడుతున్నారు. ప్రజల దైనందిన కార్యక్రమాలకు తీవ్ర విఘాతం ఏర్పడింది. రోజంతా వాన పడుతూనే ఉండడంతో ప్రజలు అత్యవసరమైతేనే తప్ప బయటకు రావడానికి ఆసక్తి చూపలేదు. దీంతో చిరువ్యాపారులు బేరాల్లేక డీలా పడ్డారు. పెద్ద వ్యాపారులపైనా వర్షం ఎఫెక్ట్ పడింది. కడియంలో నర్సరీలలో మొక్కలు నీట ముని గాయి. నీరు నిల్వ ఉండడం వల్ల మొక్క వేరు భాగం కుళ్లి పోయి పాడయ్యే ప్రమాదం ఉందని నర్సరీరైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు వర్షం తగ్గేవరకు మొక్కలు తీయడం, మొక్కలను ఎగుమతి చేసి రవాణా చేయడం నిలివేవేస్తామని రైతులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా కడియం ఆవ ప్రాంతాన్ని శనివారం తహశీల్దారు బి.రమాదేవి పరిశీలించారు. ఎగువ నుంచి వచ్చే నీరు ఆపించాలని లేకుంటే ఆలస్యంగా వేసిన వరి నాట్లతో పాటు గతంలో నాట్లు వేసిన పొలాలు కూడా పాడయ్యే ప్రమాదం ఉందని రైతులు తెలిపారు. దీంతో తహశీల్దార్ రమాదేవి ఇరిగేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. రాజమహేంద్రవరం మెయిన్‌రోడ్డులో ప్రజల రద్దీ కనిపించలేదు. దానవాయిపేట, తాడితోట ప్రాంతాల్లోని వ్యాపారాలపైనా వర్షం ప్రభావం పడింది. ఒక మోస్తరు వాన పడడంతో రోడ్లన్నీ చిత్తడిగా మారాయి. కోటిలింగాలపేట, ఆదెమ్మదిబ్బ,శ్యామలాసెంటర్, ఇన్నీసుపేట వంటి ప్రాంతాల్లో చిత్తడి, బురదతో ప్రజలు అవస్థలు పడ్డారు. కోటిలింగాలపేట నుంచి ఐఎల్‌టీడీ జంక్షన్ వరకూ గోదావరి గట్టును ఆనుకుని ఉన్న పల్లపు ప్రాంతాల్లోని ప్రజలు ఈ ముసురు కారణంగా తీవ్ర అసౌకర్యానికి లోనయ్యారు. శనివారం రాజమహేంద్రవరంలో 28 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఆదివారం కూడా ఇదే ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణశాఖ సమాచారం.ఈ నేపథ్యంలో మరో రెండు రోజుల పాటు ముసురు వదిలే సూచనలు కనిపించడంలేదు.ఈ పరిస్థితుల్లో సంబంధిత అధికారులు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిసారించడంతో పాటు తాగునీటి సరఫరాలో అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉందని ప్రజల నుంచి వినతులు వినిపిస్తున్నాయి.

48 గంటలు తెరిపివ్వని వాన

రాజమహేంద్రవరం సిటీ, జూలై 13: గడచిన 48 గంటలుగా తూర్పుగోదావరి జిల్లాలో ఎడతెరపిలేకుండా వర్షం కురుస్తోంది. చెదురుమొదరు జల్లులతో కూడిన వాన పడింది.జిల్లా వ్యాప్తంగా 19 మండలాల్లో శుక్ర, శని వారాల్లో వర్షం పడుతూనే ఉంది.శుక్రవారం రాత్రి నుంచి వర్షంఎడతెరిపి లేకుండా కురుస్తూనే ఉంది.జిల్లాలో అత్యధికంగా తాళ్ళపూడి మండలంలో 41.4 మి. మీ వర్షపాతం నమోదు కాగా అత్యల్పంగా బిక్కవోలు మండలంలో 3.2 మి.మీ వర్షపాతం నమోదైనట్టు వాతావరణ శాఖ తెలిపింది. అనపర్తి మండలంలో 6.8 మి.మీ, గోకవరంలో 15.0 మి.మీ, కడియంలో 37.2 మి.మీ, రాజమహేంద్రవరం రూరల్‌లో 36.4 మి.మీ, రాజమహేంద్రవరంలో 23.4 మి.మీ,రాజానగరంలో 6.2 మి.మీ,రంగంపేటలో 4.2 మి.మీ,సీతానగరంలో 36.0 మి.మీ వర్షపాతం నమోదైంది.కొవ్వూరు డివిజన్ చాగల్లు మండలంలో 22.2 మి.మీ, దేవరపల్లిలో 34.4 మి.మీ, గోపాలపురంలో 37.2 మి.మీ, కొవ్వూరులో 22.8 మి.మీ, నల్లజర్లలో 32.4 మి.మీ, నిడదవోలులో 17.2 మి.మీ,పెరవలిలో 22.8 మి.మీ,ఉం డ్రాజవరంలో 17.2 మి.మీ నమోదైంది.జిల్లాలో 441.4 మి.మీ ల వర్షపాతం నమోదైంది.సగటున 23.4 శాతంగా ఉంది.



వరుణుడు..ముంచేశాడు : దేవరపల్లి మండలం బందపురంలో నీట మునిగిన వరి చేలు

పెరుగుతున్న గోదారి

ధవళేశ్వరం, జూలై 13 : ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా వాగులు, వంకలు నుంచి వచ్చి చేరే నీటితో ధవళేశ్వరం వద్ద గోదావరి ఉధృతి పెరిగింది. ధవళేశ్వరం ఆర్మ్‌లోని 70 గేట్లకు 60 గేట్లు, ర్యాలీ ఆర్మ్‌లోని మొత్తం 43 గేట్లు, మద్దూరు ఆర్మ్‌లోని మొత్తం 23 గేట్లు, విజ్జేశ్వరం ఆర్మ్‌లోని 39 గేట్లకు 20 గేట్లను శనివారం సాయంత్రానికి 20 మిల్లీమీటర్ల మేర పైకి ఎత్తి 99,368 క్యూసెక్కులు జలాలను దిగువకు విడుదల చేస్తున్నారు.ధవళేశ్వరం వద్ద గోదావరి నీటిమట్టం 10.90 అడుగులుగా నమోదైంది. వ్యవసాయ అవసరాలకు తూర్పుడెల్టాకు 3500 క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 1200 క్యూసెక్కులు,పశ్చిమడెల్టాకు 6 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.పోలవరం ఎగువన అన్ని ప్రాంతాల్లో నీటిమట్టం నిలకడగా ఉంది.



మృతిచెందిన యువకుడు కువలేష్

చెట్టు విరిగిపడి యువకుడి మృతి

పెరవలి,జూలై13 : యువకుడిపై చెట్టు విరిగిపడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్ఐ ఏజీఎస్ మూర్తి తెలిపిన వివరాల ప్రకారం. చాగల్లుకు చెందిన మల్లుల కువలేష్ (25) కె.గంగవరం మండలం పేకేరులో బంధువుల ఇంటికి మోటారు సైకిల్‌పై వెళ్లి శనివారం ఉదయం తిరిగి బయలుదేరాడు. ఇదిలా ఉండగా శనివారం 11.30 సమయంలో జాతీయ రహదారిపై ఖండవల్లి కోళ్ళఫారం వద్దకు వచ్చేసరికి రోడ్డుపక్కన ఉన్న చెట్టు ఒక్కసారిగా కూలి యువకుడిపై పడింది.దీంతో అతని తలకు బలమైన గాయం కాగా తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే చనిపోయినట్లు తెలిపారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

50 హెక్టార్లలో వరి చేలు మునక

జిల్లా వ్యవసాయాధికారి ఎస్. మాధవరావు

రాజమహేంద్రవరం, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎడతెరపిలేని వర్షాల కారణంగా 50 హెక్టార్లలో వరి నాట్లు నీట మునిగాయని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు తెలిపారు. నాలుగైదు రోజుల వరకూ నీరు ఉన్నా నష్టం ఉండదని, రైతులు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని కోరుకొండ మండలం మునగాలలో 10 హెక్టార్లు, తాళ్లపూడి మండలం తిరుగుడుమెట్టలో 15 హెక్టార్లు, పెద్దేవంలో 5 హెక్టార్లు, గోపాలపురం మండలం చిట్యాలలో 20 హెక్టార్లలో వరి నీట మునిగిందన్నారు.జిల్లాలో వరి పంట 90 శాతం సాగవుతుండగా ఇప్పటి వరకూ 52 శాతం నాట్లు పూర్తయ్యాయన్నారు. ప్రస్తుత వర్షాల వల్ల పంటలకు ఎటువంటి నష్టం లేదని..అధికంగా ఉన్న నీటిని తమ పంట నుంచి బయటకు తీసే ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో వర్షం తగ్గే వరకూ వరినాట్లు తాత్కాలికంగా నిలిపివేయడం వల్ల నారు వృథా కాదన్నారు.



పోలీసులతో కలిసి లక్ష్మీనరసింహుడి హుండీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

రెండేళ్లు.. మూడు చోరీలు

కోరుకొండ లక్ష్మీనరసింహుడి ఆలయానికి భద్రత కరువు

కోరుకొండ, జూలై13:చారిత్రాత్మక కోరుకొండ శ్రీ లక్ష్మి నరసింహస్వామి దేవస్థానానికి భద్రత కరువైంది. గత 12 ఏళ్లుగా అన్నవరం దేవస్థానం దత్తత దేవాలయంగా కొనసాగుతున్న ఆలయంలో గడిచిన రెండేళ్లలో మూడు సార్లు హుండీలు అపహరణకు గురయ్యాయి. అయినప్పటికీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా శనివారం తెల్లవారుజామున ప్రధాన ఆలయ ముఖద్వారం ఏర్పాటు చేసిన హుండీని పగలకొట్టి సొమ్ము దోచుకుపోయారు. గతంలో రెండు సార్లు కొండపైన హుండీలు పగలకొట్టగా ఇప్పుడు కొండ దిగువున హుండీని పగలకొట్టారు. అయితే దొంగలు రఘుదేవపురంలోని మరో ఆలయం వద్ద దొంగతనానికి పాల్పడుతున్న సమయంలో చాకచక్యంగా గ్రామస్తులు ఒక పట్టుకుని సీతానగరం పోలీసులకు అప్పగించారు. అయితే మరో దొంగ పరారైనట్టు తెలిపారు. పట్టుకున్న దొంగను కోరుకొండ దేవస్థానం సీసీ కెమెరా పుటేజ్‌ల ఆధారంగా పోలీసులు విచారించగా నరసింహస్వామి దేవస్థాం హుండీ పగలకొట్టింది తానేనని అంగీకరించాడు.ఈ మేరకు వారి వద్ద నుంచి దేవస్థానానికి సంబంధించి రూ.31,800లను పోలీసులు రికవరీ చేశారు. దొంగలు పగలకొట్టిన హుండీని కోరుకొండ పోలీసులతో కలిసి ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పరిశీలించారు. భవిష్యత్‌లో హుండీలకు పటిష్టమైన భద్రత కల్పిస్తామన్నారు.అన్నవరం దేవస్థానం ఏలుబడిలో ఉన్న ఈ దేవస్థానంలో రాత్రిపూట ఆలయాన్ని పరిరక్షించేందుకు ఒక వాచ్‌మెన్, ఇద్దరు సెక్యూరిటీ గార్డులు ఉన్నారు.అయినప్పటికీ సెక్యూరిటీ గార్డుల నిర్లక్ష్యం కారణంగా దొంగలుసునాయాసంగా హుండీ పగలకొట్టి సొమ్ము దోచుకుపోయారని గ్రామస్తులు చెబుతున్నారు.

బడిలో.. బాగేనా!?



ఇది ప్రమాదం కాదా : నగరంలోని పాఠశాలల వద్ద అధ్వానంగా ఉన్న డ్రెయినేజీల్లోనే మంచినీటి పైప్‌లైన్లు

జిల్లాలో ప్రబలుతున్న అతిసారం

- బడుల్లో కానరాని పరిశుభ్రత
- అపరిశుభ్రంగా బాత్‌రూమ్‌లు
- చిన్నారులకు ప్రమాదం
- ముసురుతున్న సీజనల్ వ్యాధులు
- జిల్లాలో 1500 పాఠశాలలు
- కనిపించని పర్యవేక్షణ

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

పిల్లలూ జాగ్రత్త.. శుభ్రత లేకపోతే ప్రమాదం.. ఎందుకంటే అతిసారం ప్రబలుతోంది. ఒకవైపు అపారిశుధ్యం..మరోవైపు వర్షాకాలం వ్యాధులకు ఊతమిస్తున్నాయి. ఇప్పటికే పెద్దవాళ్లు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఇదిలా ఉండగా స్కూల్ పిల్లల విషయంలో ఆందోళన నెలకొంది. ఉదయం నిద్ర లేచిన దగ్గర నుంచీ రాత్రి పడుకొనే వరకూ పిల్లలు ఎక్కువగా స్కూల్‌లోనే గడుపుతారు. అతిసారం ముఖ్యంగా పరిశుభ్రత లేకపోవడం వల్ల వస్తుంది. అతిసార పెద్దలకు సోకితే కాస్త తట్టుకునే పరిస్థితి ఉంటుంది. పిల్లలకు వస్తే చాలా వేగంగా నీరసించి ప్రాణపాయస్థితిలో చిక్కుకుంటారు. వర్షాకాలం కావడంతో ఈ వ్యాధి వేగంగా వ్యాప్తి చెందే అవకాశం లేకపోలేదు.దీంతో పాఠశాలల్లో పారిశుధ్యంపై తల్లిదండ్రుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. స్కూల్‌లో వాష్‌రూమ్‌కి వెళ్లిన తర్వాత చేతులు సబ్బుతో కడుక్కుంటున్నారో లేదో.. భోజనం చేసే ప్రదేశం క్లీన్‌గా ఉందా? అనే సందిగ్ధంలో ఉన్నారు. ప్రభుత్వ , ప్రైవేటు పాఠశాలల్లో పారిశుధ్య నిర్వహణ పేలవంగా ఉంటుందనే ఆరోపణల నేపథ్యంలో మరింత భయం నెలకొంది. ఆదేశాలు జారీ చేయడంతోనే తమ వంతు పనైపోయిందనే పోకడలోనే అధికారులు ఉంటే పిల్లలు అనారోగ్యాల బారిన పడే ప్రమాదం ఉంది.

బడుల్లో తనిఖీలు పెంచాలి..

జిల్లాలో 1200 ప్రభుత్వ, 300 వరకూ ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. వీటిలో పరిశుభ్రతపై పక్కాగా దృష్టి సారించాల్సిన అవసరం కనిపిస్తోంది. ముఖ్యంగా పాఠశాలలకు తాగునీరు సరఫరా అయ్యే పైపు లైన్లను పూర్తిగా తనిఖీ చేసి అవి డ్రైన్లకు దగ్గరగా, డ్రైన్లలో ఉంటే వెంటనే మార్పు చేయాలి. పాఠశాలల్లో, బయట డ్రైన్లు శుభ్రంగా ఉండేలా చూడాలి. అన్ని పాఠశాలల్లోనూ పరిశుభ్రమైన తాగునీరందే విధంగా చర్యలు తీసుకోవాలి. ఆర్వో ప్లాంట్లు ఉంటే వాటిని పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలి. విద్యార్థులు మల, మూత్ర విసర్జనకు వెళ్తే తప్పనిసరిగా సబ్బుతో చేతులు కడుక్కునేలా చూడాలి.అతిసారం సోకితే పెరుగు ప్రొబయోటిక్ కాబట్టి అనారోగ్యం నుంచి బయట పడ డానికి చాలా బాగా పనిచేస్తుందని వైద్యులు చెబుతు న్నారు. కానీ పాఠశాలల్లో ఎక్కడా పెరుగు వడ్డించడం లేదు. 6వ తరగతి నుంచి అక్కడక్కడా మజ్జిగ పోస్తున్నా అది అన్నంలోకి పనిచేయకపోవడంతో బాటిల్‌లో పట్టు కొని తాగే పరిస్థితి ఉంది. దాతలు ముందుకొచ్చి పాఠ శాలలకు పెరుగు వితరణ చేస్తే మంచిదేమో ఆలోచించాలి.

ఇలా చేస్తే బెటర్..

పాఠశాలల్లో పరిశుభ్రత అతి ముఖ్యంగా అమలు చేయాల్సి ఉంది. ప్రతి విద్యార్థి ఆరోగ్యాన్నీ రోజూ గమనిస్తూ ఉండాలి. విద్యార్థులు భోజనం చేసే ప్రదేశాలు, మరుగుదొడ్లు, డ్రైన్లు, పరిసరాలను కచ్చితంగా పరిశుభ్ర ంగా ఉంచాలి. చెత్తను వెంటనే స్కూల్ బయటకు తరలించాలి.తుప్పలను తొలగించాలి. చాలా పాఠశా లల్లో ఆర్వో ప్లాంట్లను దాతలు సమకూర్చినా నిర్వహణ మాత్రం పడకేసింది. పిల్లలకు పరిశుభ్రతపై టీచర్లు అవగాహన కల్పించాలి. ఇంట్లో కూడా తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. చేతులకు గోళ్లు పెరగకుండా కత్తిరిస్తూ ఉండాలి.

బడుల్లో తనిఖీలు చేస్తున్నాం..



వేడి నీళ్ల మరగబెట్టి చల్లార్చి ఇవ్వాలని ఆదేశాలిచ్చాం. ఎవరికైనా ఎక్కువ దాహం వేసినా, బాత్‌రూంకి వెళతున్నా.. అనారోగ్య సూచనలు ఉంటే వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లమన్నాం. స్కూల్స్‌లో పూర్తిగా బ్లీచింగ్ చల్లించాం. ప్రతి శుక్రవారం డ్రైడే పాటిసున్నాం. వాటర్ ట్యాంకులను శుభ్రం చేయిస్తున్నాం. రోజూ పాఠశాలలను ఆకస్మిక తనిఖీలు చేసి ఇబ్బందులు ఉంటే అప్పటికప్పుడు సరిచేస్తున్నాం.

- కె.వాసుదేవరావు, జిల్లా పాఠశాల విద్యాధికారి

చేతులు శుభ్రంగా ఉంచుకోవాలి



పిల్లల విషయంలో నిర్లక్ష్యంగా ఉండకూడదు. ఎప్పుడూ కాచి వడపోసిన నీళ్ల కొంచెం గోరు వెచ్చగా తాగాలి. చేతులు శుభ్రంగా కడిగిన తర్వాతే ఆహారం తీసుకోవాలి. వాష్‌రూంకి వెళ్లొచ్చాక కూడా అంతే. స్కూల్ వాష్‌రూమ్‌లు రోజూ మూడు సార్లు క్లీన్ చేయించాలి. సీజనల్ వ్యాధులు రాకుండా వ్యాక్సిన్‌లు వేయించాలి. నీళ్ల పరిశుభ్రంగా కచ్చితంగా ఉండాలి. వాటర్‌బాటిల్ షేరింగ్ ఉండకూడదు.

- కొండా ఉమా శివరామకృష్ణ, పిల్లల వైద్యుడు

ఆర్యాపురం అర్బన్ బ్యాంక్ పోరు..హోరు

11 డైరెక్టర్ల పదవులకు 34 మంది పోటీ

రాజమహేంద్రవరం,జూలై 13 (ఆంధ్రజ్యోతి) : ఆర్యాపురం అర్బన్ బ్యాంక్ ఎన్నికలు ఈనెల 20 జరగనున్నాయి. పోటీలో మొత్తం 34 మంది ఉన్నారు. 12 మంది డైరెక్టర్లకు ఇప్పటివకే ఒకరు ఏకగ్రీవం అయ్యారు. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి చైర్మన్ అభ్యర్థిగా మాజీ చైర్మన్ చల్లా శంకరరావు ఉండగా, వైసీపీ మద్దతుతో చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ ప్రెసిడెండ్, వైసీపీ మాజీ టౌన్ ప్రెసిడెంట్ నందెపు శ్రీనివాస్‌ను తెర మీదకు తీసుకొచ్చారు. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలు, విశాఖ, గుంటూరు జిల్లాల్లో 16 బ్రాంచిలు ఉన్న ఈ బ్యాంక్ ఎన్నికల్లో 78,423 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. టీడీపీ కూటమి ప్యానల్ నుంచి చైర్మన్ అభ్యర్థిగా చల్లా శంకరరావు,బీజేపీ తరపున యెనుమల రంగబాబు, జనసేన తరపున కప్పల సూర్యప్రకాష్,టీడీపీ మద్దతుతో పోలాకి పరమేశ్, పిల్లి శ్యామ్, ఎర్రమోతు ధర్మరాజు, కాకినాడ నుంచి సింగంపల్లి రామకృష్ణ, దివాన్‌చెరువు నుంచి నీలపాల సూర్య సత్యనారాయణ, యాళ్ల వెంకట్రావు, ముగిది శ్రీనివాస్, పడాల శ్రీను ,బుడ్డిగ రవి పోటీలో ఉన్నారు. వైసీపీ మద్దతుతో ముందుకు వచ్చిన ప్యానల్‌లో నందెపు శ్రీనివాస్ చైర్మన్ అభ్యర్థి కాగా డైరెక్టర్ల పదవి రేసులో లంకా సత్యనారాయణ, ఆకుల శ్రీనివాస్, దూడల త్రినాథ్, కె.రాజేష్, నందం కుమార్‌రాజా, పి.సురేష్, పెదిరెడ్ల శ్రీనివాస్, నండూరి సుబ్బారావు, సీపీఐ నుంచి వి.రాంబాబు, గంగిశెట్టి సోమేశ్వరరావు ఉన్నారు. స్వతంత్రులు, ఇతరులు పోటీ పడుతున్నారు. 20వ తేదీన పోలింగ్ నిర్వహిస్తారు. 22న కొత్త చైర్మన్‌ను ఎన్నుకుంటారు.

అక్రమ ఇసుక రవాణాపై 9 కేసులు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 13 : జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వారిపై 9 కేసులు నమోదు చేశామని జిల్లా ఇన్‌చార్జి జేసీ దినేష్ కుమార్ తెలిపారు. ఈ మేరకు జేసీ శనివారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో ఈనెల 9 నుంచి ఉచిత ఇసుక అమ్మకం ప్రారంభించామని తెలిపారు. గోదావరి వరదలు పెరుగుతున్నందున డీసిల్టేషన్ పాయింట్ల వద్దే ఇసుకను పంపిణీ చేస్తారని తెలిపారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6గంటల వరకు మాత్రమే పంపిణీ చేస్తారని తెలిపారు. ఆటుపై స్టాక్ పాయింట్ల వద్ద సరఫరా చేస్తారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్న 9 వాహనాలు సీజ్ చేశామని తెలిపారు. జిల్లాలో ఇసుక రవాణాపై కట్టుదిట్టమైన నిఘా వ్యవస్థ అమలు చేస్తున్నట్టు చెప్పారు.

అంతర్వేదిలో బోటు మునక

9 మంది మత్స్యకారులు సురక్షితం

12 మంది కూలీలకు అస్వస్థత

5

రంపచోడవరం ఓఎస్‌డీ బదిలీ

రంప ఏరియా ఆసుపత్రికి సుస్తీ



రంపచోడవరం ఏరియా ఆసుపత్రి

(రంపచోడవరం):

వైద్యసేవల్లో నిర్లక్ష్యానికి ఓ వ్యక్తి మృతి, సదరం సర్టిఫికెట్ల జారీలో అక్రమాలు, ఆసుపత్రి వ్యవహారాల్లో ప్రైవేటు వ్యక్తులు చొరబడటంతో వైద్యుల మధ్య వర్గపోరు వ్యవహారాలతో రంపచోడవరం ఏరియా ఆసుపత్రి మునుపెన్నడూలేని వివాదాలకు కేంద్ర బిందువుగా మారింది. 100 పడకలతో మన్యం 11 మండలాలకు రిఫరల్ వైద్య కేంద్రంగా ఈ వైద్య విధాన పరిషత్ ఏరియా ఆసుపత్రి కొనసాగుతోంది. వివరాల్లోకి వెళితే....

- వైద్య సేవల్లో నిర్లక్ష్యానికి ఓ రోగి మరణం, సదరం సర్టిఫికెట్ల జారీలో అక్రమాలు
- ఆసుపత్రి వ్యవహారాల్లో ప్రైవేటు వ్యక్తుల చొరబాట్లు
- మొత్తం వ్యవహారాలపై ఆరా తీసిన ఐటీడీఏ పీవో

ఇటీవల ఓ వ్యక్తి ఇక్కడ వైద్యుల నిర్లక్ష్యానికి మృతి చెందాడన్న ఆరోపణలతో రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్‌గనోరే విచారణ జరిపించారు. ఇందులో ఓ వైద్యుడి నిర్లక్ష్యం తేటతెల్లం కావడంతో తగుచర్యల కోసం ప్రాజెక్టు అధికారి వైద్య విధాన పరిషత్ జిల్లా కోఆర్డినేటర్‌కు సిఫార్సు చేశారు. ఇదిలావుండగా రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో నిర్వహించే సదరం ఆరోగ్య కేంద్రం చుట్టూ అక్రమాల ఆరోపణలు చుట్టుముట్టాయి. ఇక్కడ సదరం వైద్యుడి పేరుతో ఆసుపత్రికి అనుబంధంగా పనిచేసే ఉద్యోగులు కొందరు, ప్రైవేటు వ్యక్తులు కొందరు సిండికేటుగా మారి అంగవైకల్యాన్ని ఆశించిన వారికి అనుకూలంగా ధ్రువీకరించేందుకు డబ్బులు వసూలు చేయడం ప్రహసంగా సాగింది. ఈ వ్యవహారంలో కొందరు తమ సదరం సర్టిఫికెట్ల కోసం డబ్బులను మధ్యవర్తులకు చెల్లించుకుని నేటికీ సర్టిఫికెట్లు రాక మోసపోయారు. ఇంతేకాకుండా ఆసుపత్రి పాలనా వ్యవహారాలకు సంబంధంలేని ప్రైవేటు వ్యక్తులు చొరబడి వైద్యులను కూడా శాసించే పరిస్థితికి వచ్చారు. కొందరైతే ఎమ్మెల్యేగారి తాలూకా అంటూ చెలామణి అయ్యేందుకు ప్రయత్నించి ఆసుపత్రిపై పట్టు సాధించాలని చూస్తున్నారు. అటువంటి వారిని పసిగట్టిన ఎమ్మెల్యేగారి శిబిరం సదరు వ్యక్తులను దూరం పెట్టినట్టు తెలిసింది. ఇదే తరుణంలో ఆసుపత్రిలోని వైద్యులు గ్రూపులుగా విడిపోయి, వర్గపోరును కొనసాగిస్తున్నారు. ఎవరి బాధ్యతలను వారు సక్రమంగా నిర్వర్తించడం కూడా వైద్యులు మానేశారు. కొన్ని సందర్భాలలో స్టాఫ్ నర్సులే రోగులను ఆదుకునే పరిస్థితి నెలకొంది. డ్యూటీలో ఉండాల్సిన డ్యూటీ వైద్యులు అత్యవసర కేసులు వచ్చాయని నర్సులు పిలిస్తేగానీ రాలేని పరిస్థితులు నెలకొన్నాయి.

సరైన వైద్య సేవలు అందడంలేదు

ఇదిలావుండగా సాధారణ రోగులు సైతం వైద్యుల మధ్య వర్గపోరు కారణంగా సరైన వైద్య సేవలు పొందలేకపోతున్నారు. దీంతో ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించడం లేదా గోకవరం ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రదీప్ అనే వైద్యుడు అందించే సేవలు కోసం అక్కడకు వెళ్లిపోతున్నారు.

ఫిర్యాదులతో కాలయాపన

దీంతో ఒకరిపై ఒకరు నిఘాను కొనసాగిస్తూ లోపాలను వెతుకుతూ ఎవరిదారిలో వారు తమకు ఉన్న పరిచయాలతో ఫిర్యాదులు చేసుకుంటున్నారు. ఒకరుపై ఒకరు చేసుకుంటు న్న ఫిర్యాదులు ఇటు అధికార వర్గాల నుంచీ, అటు ప్రజాప్రతినిధుల నుంచి సంబంధిత వైద్య విధాన పరిషత్ అధికారులకు చేరుతున్నాయి. వ్యవహారంపై రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి దృష్టి సారించడంతో ఇప్పటికే బాధ్యులపై తగు చర్యలకు రంగం సిద్ధమవుతోంది.



కొండలపై తెల్లటి మేఘాలు

అల్లూరిజిల్లా దేవీపట్నం మండలంలోని ఇందుకూరు-1 ఏనుగులగూడెం ఆర్ అండ్‌ఆర్ కాలనీ సమీపంలో గత రెండు రోజులుగా వర్షాలు కురవడంతో కొండలపై తెల్లటి మేఘాలు కమ్ముకున్నాయి. ఈ ప్రకృతి సోయగం చూస్తే ఊటీని తలపిస్తున్నట్లు ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. - దేవీపట్నం

పోలవరం లోపాలపై హైకోర్టులో పిల్

- అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్

రాజమహేంద్రవరం సిటీ, జూలై 13: పోలవరం ప్రాజెక్టు లోపభూయిష్టంకాదని ప్రభుత్వం చెబితే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ సవాల్ చేశారు. రాజమహేంద్రవరం రాజీవ్‌గాంధీ విద్యాసంస్థ కాన్ఫరెన్స్ హాలులో శనివారం విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా పోలవరం ప్రాజెక్టు కాంట్రాక్టర్లు మారిపోతున్నారన్నారు. ప్రాజెక్టు నిర్మాణంలో చాలా లోపాలు ఉన్నాయన్నారు. పోలవరం ప్రాజెక్టుపై శ్వేతపత్రం విడుదల చేసిన సీఎం చంద్రబాబు ఎంత ఖర్చు పెట్టారు.. ఇంకా ఎంత ఖర్చవుతుందనే విషయాలు ప్రస్తావించలేదన్నారు. లోపాలపై అన్ని వివరాలతో హైకోర్టులో పిల్ వేస్తున్నానని చెప్పారు. సమావేశంలో ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ కమిటీ వ్యవస్థాపకుడు కృష్ణమూర్తినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సత్యదేవుడి సేవకు వాయిద్య పరికరాల అందజేత

అన్నవరం, జూలై 13: సత్యదేవుడి సన్నిధిలో నిర్వహించే వివిధ ఆర్జితసేవలలో వాయించే మంగళధ్వనులకు అవసరమయ్యే డోలు, సన్నాయిలను విజయవాడకు చెందిన శనగశెట్టి జగదీష్ దేవస్థానం పీఆర్వో కృష్ణారావుకు అందజేశారు. వీటి విలువ సుమారు రూ.95వేలు ఉంటుందని అధికారులు తెలిపారు. ఈసందర్భంగా దాతను ఆయన అభినందించారు.

అందుబాటులోకి పుట్టగొడులు



దేవీపట్నంలో లభించిన పుట్టగొడుగులు

దేవీపట్నం, జూలై 13: ప్రతీఏటా జూలై, ఆగస్టు నెలలో అటవీ ప్రాంతాల్లో గిరిజనులకు లభ్యమయ్యే పుట్టగొడులు ఈఏడాది అందుబాటులోకి వచ్చాయి. కేవలం ఈరెండు నెలల్లో మాత్రమే అతి తక్కువగా లభ్యమవుతుంటాయి. మాంసకృతులు, ప్రొటీన్లు పుష్కలంగా ఉండడంతో వీటికి ఎంతో డిమాండ్ ఉంది.

అంతర్వేది తీరంలో బోటు మునక

- సురక్షితంగా బయటపడ్డ 9మంది మత్స్యకారులు





అంతర్వేది బీచ్‌లో బోటు మునిగినపోతున్న బోటు, అనంతరం ఒడ్డుకు చేరి మత్స్యకారులు

అంతర్వేది, జూలై 13: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది సాగర సంగమం సముద్రంలో ఇసుక మేటలు తగిలి కాకినాడ జిల్లాకు చెందిన సోనా బోటు శనివారం ఉదయం సముద్రంలో మునిగిపోయింది. బోటులో ఉన్న తొమ్మిది మంది మత్స్యకారులు సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు. కాకినాడ నుంచి నాలుగు బోట్లలో మత్స్యకారులు శనివారం ఉదయం వేటాడుతూ అంతర్వేది వైపు వస్తున్నారు. అంతర్వేది సాగరసంగమం సముద్రంలో ఇసుక మేటలు తగలడంతో ఒక బోటు సముద్రంలో నిలిచిపోయింది. ఇసుక మేటలు తగలడంవల్ల బోటుకున్న చెక్క విరిగింది. దీంతో బోటు లోపలికి నీరు ప్రవేశించింది. దీంతో బోటు మెల్లగా సముద్రంలో మునిగిపోయింది. వేటాడుతూ వస్తున్న వేరే బోటు సహాయంతో తొమ్మిది మంది మత్స్యకారులు ఒడ్డుకు చేరుకున్నారు.మునిగి పోతున్న బోటు వద్దకు వెళ్లి వలలు, వేటాడిన చేపలను తీసుకు రావడానికి స్థానిక పల్లిపాలెంలో ఉన్న చిన్నబోటు సహాయంతో స్థానిక మత్స్యకారులు, సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్న మత్స్యకారులు వెళ్లే ప్రయత్నం చేశారు. అలలు ఉధృతంగా ఉండడంతో వారు వెనుతిరిగారు. మునిగిపోయిన బోటులో వలలు, వేటాడిన చేపలు ఉన్నాయి. రూ.20లక్షల నష్టం ఏర్పడిందని బోటు నిర్వాహకుడు వీరబాబు తెలిపాడు. కాకినాడకు చెందిన కొప్పాలి ధన బోటు యజమానిగా స్థానిక మత్స్యకారులు గుర్తించారు. కామాడి తాతారావు, కామాడి గోవిందు, బొడ్డు తాతారావు, బొడ్డు కృష్ణమూర్తి, కర్రి సత్యనారాయణ, కర్రి అప్పారావు, మరో ముగ్గురు మత్స్యకారులు బోటు ప్రమాదం నుంచి బయటపడ్డారు.

భక్తవత్సల గోవింద గోవిందా...

- స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.43.25 లక్షలు



వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి



స్వామివారిని దర్శించుకున్న జిల్లా జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్

ఆత్రేయపురం, జూలై 13: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామివారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మీహోమం, బాలబోగం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తిరువీధులలో ఏడు ప్రదక్షణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు తులాభారాలు, కానుకులు సమర్పించుకున్నారు. భారీ క్యూలైన్ల స్వామివారిని దర్శించుకున్న భక్తులు స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. తూర్పుగోదావరిజిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్ కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. ఆయనకు స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. వివిధసేవలద్వారా స్వామివారి ఒక్క రోజు ఆదాయం రూ.43.25లక్షలు లభించినట్టు డిప్యూటీ కమిషనర్, ఈవో కిషోర్‌కుమార్ తెలిపారు.

శృంగారవల్లభ స్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు



శృంగారవల్లభస్వామి

పెద్దాపురం, జూలై 13: కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. స్వామివారి దర్శనానికి భక్తులు తెల్లవారు జామునే బారులు తీరారు. టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.2,56,900 అన్నదాన విరాళాలు రూ.52,361 ఆదాయం, కేశఖండన ద్వారా రూ.6,600 తులాభారం రూ.250, లడ్డూ ప్రసాదం ద్వారా 30,060, వెరసి రూ.3,46,171 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. సుమారు 15 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారని తెలిపారు. దేవస్థానం అర్చకులు పెద్దింటి నారా యణాచార్యులు పాల్గొన్నారు.

కళారంగం అభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యులవ్వాలి

- సీ పోర్ట్స్ లిమిటెడ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మురళీధర్



సూర్యకళామందిర్‌లో ఎస్‌వీఎస్‌వీవీఎస్ మూర్తికి ఆంధ్రశ్రీ అవార్డు అందజేస్తున్న దృశ్యం

పోర్టు సిటీ (కాకినాడ), జులై 13: కళారంగం అభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యులవ్వాలని కాకినాడ సీ పోర్ట్స్ లిమిటెడ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మెర్ల మురళీధర్ అన్నారు. అల్లూరి సీతారామారాజు నాటక కళాపరిషత్ 24వ ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వానపు నాటికల పోటీలు పురస్కరించుకుని మూడోరోజు శనివారంరాత్రి స్థానిక సూర్యకళా మందిరంలో నిర్వహిచిన సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని పైవిధంగా వ్యాఖ్యానించారు. ఆత్మీయఅతిథిగా పాల్గొన్న ప్రణవ ఆశ్రమం మాతాజీ సుమిత్రానంద సరస్వతి మాట్లాడుతూ భారతీయ కళలవైపు ప్రపంచ దేశాలు చూస్తుండటం, మన దేశానికే గర్వకారణమని చెప్పారు. అనంతరం సలాది వీర వెంకటసత్యనారాయణమూర్తికి ఆంధ్ర ఆవార్డు బహూకరించారు. ఈ కార్యక్రమానికి తొలుత నిర్వహించిన ఏకపాత్రాభినయ పోటీలు అందరినీ ఆకట్టుకున్నాయి.

అందరినీ ఆలోచింప చేసిన మూల్యం నాటిక..

గోవాడ క్రియేషన్స్ హైదరబాద్ ఆధ్వర్యంలో సింహప్రసాద్ రచన, డాక్టర గోవాడ వెంకట్ దర్శకత్వంలో ప్రదర్శించిన మూల్యం నాటిక అందరినీ ఆలోచింప చేసింది. నేటి సమాజంలో ఆడపిల్లలపై పెడుతున్న ఆంక్షలను ప్రధాన ఇతివృత్తంగా తీసుకుని ప్రదర్శన కొనసాగింది. మహిళలపై వివక్షతకు వ్యతిరేకంగా ఒక వివాహిత మహిళ ఏ విధంగా హక్కులను సాధించింది నాటిక రూపంలో ప్రదర్శించారు. అదేవిధంగా కరీంనగర్ చైతన్య భారతి సంస్థ ఆధ్వర్యంలో స్వప్నం రాల్చిన అమృతం నాటికను ప్రదర్శించారు. నాటికకు మూలకథ పీఎస్ నారాయణ అందించగా, మంచాల రమేష్ దర్శకత్వం వహించారు. కార్యక్రమంలో కళాపరిషత్ గౌరవాధ్యక్షుడు కర్రి భామిరెడ్డి, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు కర్రి అచ్చుతరామారెడ్డి, పంపన దయానందబాబు, జాతీయ అల్లూరి యువజన సేవఆ సంఘం అధ్యక్షుడు పడాల వీరభద్రరావు, గౌరవ సలహాదారులు గట్టి సత్యనారాయణ, రాయప్రోలు భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

గొల్లప్రోలులో విజిలెన్స్ తనిఖీలు

- రూ.20.42లక్షలు విలువైన రేషన్ బియ్యం స్వాధీనం
- క్రిమినల్ కేసులు నమోదు



గొల్లప్రోలులో విజిలెన్స్ అధికారులు సీజ్ చేసిన రేషన్‌బియ్యం లారీ

గొల్లప్రోలు, జూలై 13: కాకినాడజిల్లా గొల్లప్రోలు పట్టణ శివారులో విజిలెన్స్ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. రేషన్‌బియ్యం లారీలో తరలిపోతున్నట్లు అందిన సమాచారం మేరకు విజిలెన్స్, రెవెన్యూ, పౌరసరఫరాల శాఖల అధికారులు సంయుక్తంగా పట్టణ శివారులో తనిఖీలు చేపట్టారు. లారీని తనిఖీ చేయగా 458 బస్తాల్లో ఉన్న 229 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. రూ. 20.42లక్షలు విలువైన ఈ రేషన్‌బియ్యాన్ని, లారీని సీజ్ చేశారు. దుర్గాడ గ్రామానికి చెందిన ఉమ్మిడి కృష్ణకిరణ్, గొల్లపల్లి శ్రీనివాసరావులు ఈ రేషన్‌బియ్యాన్ని చత్తీస్‌ఘడ్ తరలిస్తున్నట్లు విజిలెన్స్ విచారణలో వెల్లడైంది. పౌరసరఫరాలశాఖ ద్వారా 6ఏ కేసు నమోదుచేసి బియ్యం, లారీ నిల్వలు స్వాధీనం చేయడంతోపాటు రవాణా చేస్తున్న వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పోలీసులకు సూచించారు. ఈ సందర్భంగా విజిలెన్స్ ఎస్పీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా పరిధిలో ఎవరైనా రేషన్ బియ్యం కొనడం, అమ్మడం చేసినా, నిల్వలు ఉంచినా, రవాణాకు పాల్పడినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో విజిలెన్స్ ఎస్ఐ జగన్నాథరెడ్డి, ఏవో బార్గవమహేష్, పీసీలు వలీ, వీరబాబు, సీఎస్‌డీటీ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం ఓఎస్‌డీ బదిలీ



ఓఎస్‌డీ కేవీ మహేశ్వరరెడ్డి

చింతూరు, జూలై 13: రంపచోడవరం ఓఎస్‌డీ కేవీ మహేశ్వరరెడ్డి బదిలీ అయ్యారు. ఈమేరకు ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. ఈ క్రమంలో బదిలీతోపాటు పదోన్నతిని పొందిన మహేశ్వరరెడ్డి శ్రీకాకుళం జిల్లా ఎస్పీగా బాధ్యత లు చేపట్టనున్నారు. 2019 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన మహేశ్వరరెడ్డి మొదటి పోస్టింగ్‌లో భాగంగా 2022 ఆగస్టు22న చింతూరు ఏఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. అప్పటి నుంచి 2023 ఏప్రిల్ 30 వరకు ఆయన ఏఎస్పీగా ఉన్నారు. అనంతరం ఆయనకు రంపచోడవరం ఓఎస్‌డీగా బాధ్యతలు అప్పగించారు.

ప్రాజెక్టులకు జలకళ

- పొంగుతున్న వాగులు, వంకలు
- స్తంభించిన జనజీవనం
- భారీ వర్షాలతో పోటెత్తుతున్న వరదనీరు



ఎటపాక: జలకళను సంతరించుకున్న అలుగు ప్రాజెక్టు





ఇందుకూరుపేట వద్ద పొంగిన ఇనుకొండ వాగు, చెరువు నీరు బయటకు పోతున్న దృశ్యం

దేవీపట్నం, జూలై 13: అల్పపీడనం ప్రభావంతో శుక్ర, శనివారాల్లో కురిసిన వర్షాలకు అల్లూరిజిల్లా దేవీపట్నం మండలంలో ఇను కొండ, సీతపల్లి, ఫజుల్లాబాద్ తదితర వాగులు పొంగి ప్రవహించడంతో ఆయా గ్రామాల్లో జనజీవనం స్తంభించింది. ఎక్కడి ప్రజలు అక్కడే ఉండిపోవడంతో రహదారులన్నీ నిర్మానుష్యంగా మారాయి. చాలావరకు ప్రజ లు తమ ప్రయాణాలు రద్దు చేసుకుంటున్నారు. ఇందుకూరు గ్రామ శివారున రైతు ముచ్చు నాగేశ్వరరావు చెరువులోకి అధిక మొత్తంలో వర్షపునీరు చేరడంతో చెరువులోని చేపలు తరలిపోయాయి. దీంతో లక్షల్లో నష్టం వాటిల్లినట్లు బాధితుడు చెబుతున్నాడు.

నిండిన అలుగువాగు ప్రాజెక్టు

ఎటపాక, జూలై 13: అల్లూరి జిల్లా ఎటపాక మండ లం అచ్చుతాపురం గ్రామంవద్ద ఉన్న అలుగువాగు ప్రాజెక్టుకు జలకళ సంతరించుకుంది. గత ఐదారు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలతోపాటు ప్రాజె క్టు ఎగువన భారీ వర్షాలు పడడంతో వరద నీరంతా ప్రాజెక్టులోకి వచ్చి చేరుతోంది. దాంతో ప్రాజెక్టు నిండి వరదనీరంతా పొంగిపొర్లుతోంది. వరద ప్రవాహం ప్రాజెక్టు దిగువకు ప్రవహిస్తోంది. వరద నీరంతా ప్రవహిస్తూ ఉండడంతో స్థానిక గిరజనులు జోరుగా చేపలను వేటాడుతున్నారు.

పురుగులమందు కలిసిన నీళ్లు తాగిన
12 మంది కూలీలకు అస్వస్థత

- వడ్డిపాలెం చెరువుల వద్ద ఘటన
- క్షతగాత్రులు పశ్చిమ బెంగాల్ వాసులు



కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్సపొందుతున్న పశ్చిమ బెంగాల్ కూలీలు

కరప, జూలై 13: ప్రమాదవశాత్తూ పురుగులమందు కలిసిన నీటిని తాగి 12మంది కూలీలు అస్వస్థతకు గురయ్యారు. వీరిలో ఇద్దరి పరిస్థితి సీరియస్‌గా ఉన్నట్లు తెలిసింది. క్షతగాత్రులు పశ్చిమ బెంగాల్‌కు చెందినవారిగా గుర్తించారు. స్థానికంగా సంచలనమైన ఈ విషయాన్ని బయటకు పొక్కకుండా కరప పోలీసులు విఫలయత్నంచేయడం వెనుక పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామస్థులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. కాకినాడ జిల్లా కరప మండలం యండమూరు శివారు వడ్డిపాలెంలో కిరణ్‌రాజు అనే వ్యక్తి ఆక్వా చెరువులను సాగుచేస్తున్నారు. పశ్చిమబెంగాల్‌కు చెందిన 12మంది కూలీలు 15రోజుల క్రితం ఇక్కడకు వచ్చి చెరువులవద్ద పనులు చక్కబెడుతున్నారు. శనివారం ఉదయం కూలీలు తమ పని ముగించుకుని వాటర్ టిన్నులోని నీరు తాగి ఒక్కసారిగా వాంతులు చేసుకుని అస్వస్థతకు గురయ్యారు. పశ్చిమబెంగాల్‌కు చెందిన షేక్ సలీం, అజీద్, నూరుద్దీన్, అమనుల్లా, ఫరూఖ్, కలిపటిముండ్, ప్రొడాస్, సొంతూల్, ఫైజల్, అన్వర్, సలుద్దీన్, అమీనుద్దీన్‌లు విషతుల్యమైన నీటిని తాగినట్టుగా గుర్తించారు. వీరిలో ఇద్దరి పరిస్థితి సీరియస్‌గా ఉన్నట్టు తెలుస్తోంది. పురుగులమందు కలిసిన నీటిని తాగడంవల్లనే ఇలా జరిగిందని ప్రాథమికంగా గుర్తించారు. చెరువుల యజమాని ఫిర్యాదు మేరకు కరప పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. క్షతగాత్రులను కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స అనంతరం కోలుకున్నారు. ఈ ఘటనకు కారణాలను పోలీసులు అన్వేసిస్తున్నారు. కొన్నిరోజుల క్రితం పిచికారీ చేసిన గడ్డిమందు ప్రభావంవల్ల వాటర్ టిన్నుల్లో తాగునీరు విషపూరితమైనట్టుగా భావిస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్టు కరప ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. వేళంగి పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఎంకే సౌజన్య కాకినాడ ప్రభుత్వాసుపత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించి వా రి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

సరిగ్గా చదవలేదని కొట్టారు!

- మంచానికే పరిమితమైన విద్యార్థిని
- గురుకుల ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

పిఠాపురం, జూలై 13: సరిగ్గా చదవలేదని కొట్టడంతో గురుకుల పాఠశాల విద్యార్థిని మంచానికే పరిమితమైన సంఘటన ఆలస్యంగా శనివారం వెలుగులోకి వచ్చింది. ఇందుకు బాధ్యులపై గురుకుల ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం చిత్రాడ గ్రామానికి చెందిన నురుకుర్తి అమృత పట్టణంలోని జగ్గయ్యచెరువు కాలనీలో గల బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్నది. పాఠ్యాంశాలు చదవడం లేదంటూ అమృతను ఉపాధ్యాయులు కర్రతో విచక్షణా రహితంగా కొట్టారని, 24గంటలు పాటు గదిలో నిర్బంధించారని విద్యార్థిని తల్లిదండ్రులు తెలిపారు. నడుము, వెన్నుముఖ, తల, శరీరంపై బలమైన గాయాలు కావడంతో అమృత స్పృహ కోల్పోయిందని, కొందరు ఉపాధ్యాయులు ఆసుపత్రిలో చేర్పి చేతులు దులుపుకున్నారు. డిసెంబరు నెలలో ఈ సంఘటన జరగ్గా అప్పటి నుంచి తాము ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స చేయించినా తమ కుమార్తె అమృత కోలుకోలేదని తల్లిదండ్రులు తెలిపారు. చికిత్స చేయించేందుకు తమ వద్ద ఉన్న సొమ్ముతో కాలనీవాసులు ఇచ్చిన డబ్బుతో చికిత్స చేయించామని చెప్పారు. తమ కుమార్తె మంచానికే పరిమితమైందని వారు కన్నీరుమున్నీరుగా విలపించారు. తాము ప్రిన్సిపాల్, పీఈటీలను ప్రశ్నించి ఫిర్యాదు చేయడానికి గురుకుల పాఠశాలకు వస్తే లోపలకు కూడా అనుమతించడంలేదని తెలిపారు. అక్కడ బంధువులతో కలిసి ఆందోళన నిర్వహించారు. తాము మానసిక క్షోభను అనుభవిస్తున్నామని, బాధ్యులైన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. తాము ఏ విద్యార్థినిని కొట్టలేదని, ఏప్రిల్ వరకూ పాఠశాలకు వచ్చిందని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ త్రివేణి తెలిపారు. వేసవి సెలవులు తర్వాత సదరు విద్యార్థిని రాకపోవడంతో తాము అడిగామని, అందుకే ఈ విధంగా చెబుతున్నారని చెప్పారు.

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఏజెన్సీ సమాచారం

గండి పోశమ్మ హుండీ ఆదాయం రూ.5.35లక్షలు

దేవీపట్నం, జూలై 13: మండలంలోని గొందూరు గ్రామంలో గల శ్రీగండిపోశమ్మ అమ్మవారి దేవస్థానం వద్ద గోదావరి వరదనీరు పెరుగుతున్న కారణంగా శనివారం దేవదాయ ధర్మాదాయ శాఖాధికారి ఎస్.చంద్రశేఖర్ సమక్షంలో హుండీ లెక్కింపు నిర్వహించారు. గ్రా మస్తులు, పోలీసు, బ్యాంక్, దేవదాయ శాఖాధికారుల సమక్షంలో అమ్మవారి హుండీ తెరిచి లెక్కించగా 125 రోజులకుగాను రూ.5,35,675 నగదు, 28గ్రాముల బంగారం, 530 గ్రాముల వెండి వచ్చిందని అధికారులు తెలిపారు.

'వర్షాలకు అప్రమత్తంగా ఉండాలి'

వై.రామవరం, జూలై 13: అల్లూరి జిల్లా వై.రామవరం మండలంలో గడిచిన 36 గంటల నుంచి వర్షాలు అధికంగా కురుస్తున్న కారణంగా గిరిజన ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో కె.బాపన్నదొర సూచించారు. కాలువల వద్దకు ఎవరూ వెళ్లరాదని చెట్ల కిందకు, పాడుబడిన భవనాల వద్ద ఉండవద్దన్నారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బం ది హెడ్‌క్వార్టర్స్‌లో అందుబాటులో ఉండాలన్నారు. కరెంటు నిలిచిపోయే అవకాశమున్నందున ముందు జాగ్రత్తగా మంచినీటి ట్యాంకుల్లో వాటర్ నిలిపి ఉంచాలని ప్రజలు అవసరమైన మేరకు తాగునీటిని ఉప యోగించుకోవాలన్నారు. రోడ్లపై చెట్లు పడిని ఎడల వెంటనే తొలగించే చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. గ్రామాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాలన్నారు. వర్షాలకు జరిగిన సంఘటనలపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్‌రూమ్‌కు 798188755(టైపిస్ట్), 9440588637(జూనియర్ అసిస్టెంట్), 9849848138 (ఈవోపీఆర్డీ), 9441153621 (ఎంపీడీవో)కు సమాచారం ఇవ్వాలన్నారు.

మోతుగూడెంలో పిచ్చికుక్క స్వైర విహారం



మహిళ కాలుమడంపై పిచ్చికుక్క కరిచిన దృశ్యం

మోతుగూడెం, జూలై13: చింతూరు మండలం మోతుగూడెం జగదాంబ సెంటర్లో గత నాలుగురోజుల నుంచి పిచ్చికుక్క స్వైర విహారం చేస్తుంది. కనిపించే వారిని కరుస్తున్నాయి. శనివారం సాయంత్రం జగదాంబ సెంటర్ నుంచి మార్కెట్ సెంటర్‌కి వెళ్తుండగా మార్గమధ్యలో పెంటకోటి స్వప్న మహిళపై పిచ్చికుక్క దాడిచేసి కుడి కాలు మడంపై, డోల అప్పారావుకు ఎడమ కాలు పిక్కలమీద కరిచింది. దీంతో ఆ ప్రాం తంలో ఉన్న ప్రజలు భయపడుతున్నారు. వారి పిల్లలను బయటకు రానీయకుండా చూసుకుంటున్నారు. వారం రోజుల నుంచి పిల్లలు ఇంటి వద్దే ఉన్నారు. ఈ పిచ్చికుక్కల దాడి నుంచి తమ పిల్లలను ఎలా రక్షించుకోవాలో ఆందోళన చెందుతున్నారు. గాయపడినవారిని ఏపీ జెన్కో భవ్య హెల్త్ సెంటర్‌కు తరలించగా వైద్యులు ఆదిత్య, సిబ్బంది వారికి ప్రథమ చికిత్స చేసి రాబిస్ వ్యాక్సిన్‌లు వేశారు. ఈ పిచ్చి కుక్కలను అధికారులు అదుపులోకి తీసుకోవాలని మోతుగూడెం స్థాకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పలు సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యేను కలిసిన టీడీపీ నాయకులు

ఎటపాక, జూలై 13: ఎటపాక మండలంలో గన్నవరం, కృష్ణవరం గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై టీడీపీ నాయకులు బొల్లా పుల్లయ్య దానే రాజు ఎమ్మెల్యే శిరీషాదేవికి వివరించారు. శనివారం రంపచోడ వరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను టీడీపీ నాయకులు కలిశారు. ఈ రెండు గ్రామాలను పోలవరం జాబితాలో చేర్చాలని కోరారు. గ్రామాల అభివృద్ధికి పాటుపడాలని పేర్కొన్నారు

వీఆర్‌వో మృతికి సంతాపం



శ్రీనివాసుదొర(ఫైల్)

రంపచోడవరం, జూలై 13: మండలంలోని బందపల్లి క్లస్టర్ వీఆర్వోగా పనిచేస్తున్న పొడియం శ్రీనివాసుదొర శుక్రవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. గత ఆదివారం వీఆర్వో ఎం.గణపతిరెడ్డి కూడా గుండెపోటుతో మరణించిన సంఘటన మరువక ముందే ఈ ఘటనతో కార్యాలయంలో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి. డివిజన్ వీఆర్వోల సంఘం సభ్యులు రవి, గుణ భూషణం, సాయికృష్ణ కుటుంబసభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు.

మోతుగూడెంలో భారీ వర్షం



మోతుగూడెంలో భారీ వర్షానికి మార్కెట్‌సెంటర్

మోతుగూడెం, జూలై 13: చింతూరు మండలం మోతుగూడెం పరిసర ప్రాంతాల్లో శనివారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు ఏకధాటిగా వర్షం కురిసింది. ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షానికి జన జీవనం స్థంభించింది వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి.

సిరిగిందలపాడు పంట కాలువకు మరమ్మతు పనులు చేపట్టాలి

రంపచోడవరం, జూలై 13: ఎన్నోఏళ్లగా అపరిష్కృ తంగా ఉన్న సిరిగిందలపాడు పంట బోదె(పంటకా లువ)ను మరమ్మతుపనులు చేపట్టాలని ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవికి పందిరిమామిడి, ఇర్లపల్లి, జాగరంపల్లి గ్రామాల రైతులు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పండా చెల్లన్నదొర గతంలో పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన సమస్యను పరిష్కరించలేదని వాపోయారు. పంట కాలువ ద్వారా సుమారు 1500 ఎకరాలు సాగు చేసుకొనేందుకు వీలుపడుతుందన్నారు. భూపతిపాలెం జలాశయం రావడంతో సిరిగిందల పాడు పంటకాలువను పట్టించుకోవడంలేదన్నారు. పంట కాలువ పనులు తక్షణమే ప్రారంభించాలని లేకుంటే మూడు గ్రామాల భూములు బీడు భూములుగా మారే అవకాశం ఉందన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొని యువకుడి మృతి

నల్లజర్ల, జూలై 13: మండలంలోని అనంతపల్లిలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. సీఐ దుర్గాప్రసాద్ వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా చీరాల సమీపంలోని జాంద్రపేటకు చెందిన కె.సంతోష్‌కుమార్ శనివారం రాజమహేంద్రవరం నుంచి విజయవాడ వెళుతుండగా అనంతపల్లి బైపాస్‌లో ముందు వెళుతున్న ట్రాక్టర్‌ను ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పశుగ్రాసం పెంపకంపై అవగాహన

చాగల్లు, జూలై 13: పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా రైతులకు పశుగ్రాసం పెంపకంపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల పశువైద్యాధిరి యు.ముఖేష్ మాట్లాడుతూ నూతన పశుగ్రాసం అవసరం, గడ్డికోసే యంత్రంపై అవగాహన కలిగించారు. మండలంలోని నెలటూరు, మల్లవరం, చంద్రవరం, దారవరం, మార్కొండఎడు గ్రామాల్లో పర్యటించి రైతులకు పశుగ్రాసం పెంపకంలో నూతన విధానాలపై అవగాహన కలిగించారు.

తూర్పుగోదావరి

నేడు రచయితల సమావేశం

రాజమహేంద్రవరం కల్చరల్, జూలై 13: ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాలలో ఆదివారం ఉదయం 10గంటలకు కళాగౌతమి రచయితల సమావేశం జరుగుతుందని కళాగౌతమి అధ్యక్షుడు పీవీబీ.సంజీవరావు శనివారం తెలిపారు. 30 ఏళ్లుగా కళా గౌతమి సంస్థ సాహితీ సేవచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో అనేక సాహిత్య విషయాలు, కవితలు వినే అవకాశం ఉందన్నారు.

చినుకు పడితే చిత్తడే!

- గోకవరం ఆర్టీసీ డిపో గోతులమయం
- వర్షంనీరు నిలిచిపోయి బురదమయం
- పేరుకుపోయిన చెత్త, చెదారాలు
- దోమల బెడద.. తాగునీటి సౌకర్యం శూన్యం



గోకవరం ఆర్టీసీ డిపో ప్రాంగణంలో అపరిశుభ్ర వాతావరణం

గోకవరం, జూలై 13: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గోకవరం ఆర్టీసీ డిపో ప్రాంగణం అసౌకర్యంగా మారింది. నాల్గు వైపులా వర్షం నీరు నిల్వ ఉండడంతో డిపోలోకి అడుగు పెట్టేందుకు ప్రయాణికులు పలు అవస్థలు పడుతున్నారు. డిపో నుంచి నాలుగైదు అడుగులు దాటి బస్సు బయటకు కదిలితే ఆ



ఆర్టీసీ డిపో ప్రాంగణంలో నిలిచి ఉన్న నీరు

బస్సు ఎక్కేందుకు ప్రయాణికుడు నానా అగచాట్లు పడాల్సిందే. కొంతకాలం క్రితం గోతులమయంగా ఉన్న డిపో ప్రాంగణంలో కొంతభాగాన్ని సిమ్మెంట్‌తో ఫ్లోరింగ్ చేసి మిగిలిన భాగం అలాగే ఉంచేశారు. దీంతో వర్షాలు పడినపుడు గోతుల్లోకి నీరు చేరి బురదమయంగా తయారవుతోంది. డిపోలోకి వెళ్లాలంటేనే కాళ్లు నిండా బురద అంటుకుంటోంది. రోజుల తరబడి నీరు నిల్వ ఉండడంతో దోమలు వ్యాప్తి చెంది ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. అటు మైదాన ప్రాంతాల ప్రయాణికులకు, ఇటు ఏజెన్సీ ప్రాంతాల నుంచి వచ్చే ప్రయణికులకు ఈ డిపో చాలా కీలకమైనది. రోజూ వందలాది మంది ఇక్కడ నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. ఇంత ప్రాధాన్యమున్న డిపోను అధికారులు నిర్లక్ష్యంగా వదిలేయడంతో ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. డిపో ఆవరణలో చెత్త, చెదారాలు ఎక్కడికక్కడ నిల్వ ఉంటున్నాయి. కొద్దిరోజుల నుంచి తాగునీటి సౌకర్యం లేక ప్రయాణికులు దుకాణాల వద్ద వాటర్ బాటిళ్లను కొనుగోలు చేసుకుంటున్నారు. ప్రయాణికులు కూర్చోడానికి సరపడా బెంచీలు కూడా లేవు. ఉన్నతధికారులు స్పందించి గోకవరం ఆర్టీసీ డిపోలో నెలకొన్న సమస్యలపై ప్రత్యేకదృష్టి సారించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ప్రజలకు సురక్షిత తాగు నీరందించాలి

- ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ దినేష్‌కుమార్

కడియం, జూలై 13: వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని సీజనల్ వ్యాధులు ప్రబలకుండా సురక్షిత తాగునీటిని ప్రజలకు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ కె.దినేష్‌కుమార్ తెలిపారు. కడియం శెట్టిబలిజపేటలో పంచాయతీ, ఆర్‌డబ్ల్యుఎస్, వైద్యఆరోగ్యశాఖ అధికారులతో కలిసి ఆయన శనివారం పర్యటించి మంచినీటి ట్యాంకును పరిశీలించారు. వాటర్‌ట్యాంకులు, తాగునీటి సరఫరాపై పంచాయతీ అధికారులను ఆరా తీసారు. ప్రతి గ్రామంలో వాటర్‌ట్యాంకులను పూర్తిస్థాయిలో శుభ్రపరిచి శుద్ధిచేసిన తాగునీటిని ప్రజలకు అందించే విధంగా అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ వెలుగుబంటి నాని, డీఎల్‌పీవో ఎం.నాగలత, ఎస్ఈ బాలశంకర్, డీఈ శ్రీనివాసరావు ఉన్నారు.



కడియంలో అధికారులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి జేసీ దినేష్‌కుమార్

ఎంపీడీవో, కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు

కడియం, జూలై 13: ఎంపీడీవో జి.రాజ్‌మనోజ్, కడియం గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శి ఎం.శ్రీనివాసరెడ్డి, వేమగిరి గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శి కేవీఎస్ఎస్ఎన్ రాజశేఖర్‌లకు షోకాజ్‌నోటీసులు జారీ చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి డి.రాంబాబు తెలిపారు. ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ కె.దినేష్‌కుమార్ శనివారం కడియం పర్యటనకు వచ్చారు. ఆ సమయానికి హాజరు కాని ఎంపీడీవో, కడియం, వేమగిరి గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులకు ఇన్‌చార్జి జేసీ ఆదేశాల మేరకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్టు తెలిపారు.

సమన్వయంతో పనిచేయాలి

సీతానగరం, జూలై 13: సీజనల్ వ్యాధుల నియంత్రణకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీవో కేఎస్ఆర్ కృష్ణప్రసాద్ సూచించారు. శనివారం సీతానగరం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన మండల స్థాయి అధికారులతో సీజనల్ వ్యాధులు-నియంత్రణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సురక్షిత తాగునీరు సరఫరా, పరిసరాల పరిశుభ్రత, ఇంటి లోపల, బయట నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం తదితర అంశాలపై శ్రద్ధ పెట్టాలని ఎంపీడీవో చెప్పారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ మూర్తి డాక్టర్లు కేవీకే చైతన్య, ఎస్.రాజు, రెవెన్యూ, ఆర్‌డబ్ల్యుఎస్, ఆరోగ్య, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా కార్యాచరణ

- డ్రైనేజీ వ్యవస్థను పటిష్ఠ పరుస్తాం
- 22,36 డివిజన్ల పర్యటనలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి



ఇండోర్ స్టేడియం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వాసు, కమిషనర్ దినేష్‌కుమార్

రాజమహేంద్రవరం సిటీ, జూలై 13: రాజమహేంద్రవరంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా కార్యాచరణ రూపొందించామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం 22,36 డివిజన్లలో శనివారం పర్యటించి డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించి ప్రజల సమస్యలను అడిగితెలుసుకున్నారు. నెల రోజులుగా నగరంలోని డ్రైనేజీ వ్యవస్థను ప్రక్షాళన చేస్తున్నామన్నారు. కొన్ని ప్రాంతాల్లో ఇంకా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచవలసి ఉందని, కార్పొరేషన్ అధికారులు చర్యలు చేపడుతున్నారన్నారు. గత ప్రభుత్వంలో వైసీపీ నాయకులు డ్రైనేజీ వ్యవస్థపై దృష్టి సారించకపోవడంతో చిన్నపాటి వర్షానికే వీధులు జలమయమయ్యేవి అన్నారు. కంబాలచెరువు హైటెక్ బస్టాండ్ ఎదురుగా ఉన్న శ్యామలా బిల్డింగ్‌లో ఏర్పాటు చేసిన పేరెంట్స్ టీచర్స్ అండ్ స్టూడెంట్స్ యునైటెడ్ ఫెడరేషన్ (పీటీఎస్ఎఫ్) ప్రధాన కార్యాలయాన్ని సంస్థ వ్యవస్థాపకుడు కొల్లాపు వేణు ఆధ్వర్యంలో ప్రారంభించారు. కార్యక్రమంలో యాళ్ల ప్రదీప్, శెట్టి జగదీష్, మాటూరి సిద్దు, నారాయణరావు, రాజేష్, రాజా, నల్లం ఆనంద్, పింకేష్, అజిత్, బృంగిమల, నారాయణ, దాసరి రమేష్, ఫైండ రవి పాల్గొన్నారు.

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం

శారీరక మానసికోల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం 50వ డివిజన్‌లో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్మించిన ఇండోర్ షటిల్ బ్యాడ్మింటన్ స్టేడియాన్ని ఆయన ప్రారంభించారు. కొద్దిసేపు షటిల్ బ్యాడ్మింటన్ ఆడి సందడి చేశారు. కమిషనర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ రూ.23.4 కోట్ల సాధారణ నిధులతో నిర్మించిన షటిల్ బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియంలో మూడు షటిల్ కోర్టులు ఉంటాయన్నారు. కార్యక్రమంలో డీపీ నారాయణ, డీఈవీ ప్రసాద్, ఏఐ షర్మిళ, ఎస్ఈ జి.పాండురంగారావు, ఈఈ ఎస్నే మదర్సా అలీ, సీఐ ఎస్‌పీ వీరయ్యగౌడ్, బ్యాడ్మింటన్ కోచ్ కె.విజయ్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశి నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

రాజమహేంద్రవరంలో యూటీఎఫ్ నిరసన



కంబాలచెరువు వద్ద జీపీఎస్ గెజిట్ ప్రతులు దహనం చేస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 13 : రాష్ట్ర ప్రభుత్వం జీపీఎస్ అమలు చేస్తూ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడం అన్యాయమని, ప్రభుత్వం పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని యూటీఎఫ్ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.జయకర్, ఏ.షరీఫ్ అన్నారు. ఈమేరకు శనివారం కంబాలచెరువు పార్కు వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. జీపీఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మానవహారం నిర్మించి గెజిట్ ప్రతులను దహనం చేశారు. ప్రస్తుత ప్రభుత్వం సీపీఎస్ ఉద్యోగులతో చర్చించకుండా జీపీఎస్ అమలు చేయడం సరికాదని, వెంటనే గెజిట్ రద్దు చేయాలని యూటీఎఫ్ నాయకులు కోరారు. ఈ కార్యక్ర మంలో నాయకులు ఎం.విజయగౌరి, వీఎస్ఆర్.ప్రసాద్, ఎం.రవిబాబు, టీఎస్.ప్రకాశరావు, శ్రీమణి, ఎం.రమేష్‌బాబు, సీహెచ్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించండి



వాటర్ ట్యాంక్ శుభ్రం చేస్తున్న దృశ్యం

రాజానగరం, జూలై 13: పరిసరాల పరిశుభ్రతలో ప్రజలంతా భాగస్వాములు కావాలని ఎంపీడీవో జ్యోతిర్మయి అన్నారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా మండలంలోని పంచాయతీ అధికారులు ఆయా గ్రామాల్లోని మం చినీటి ట్యాంకులను శుభ్రం చేయించి, క్లోరినేషన్ పనులు చేపట్టారు. గ్రామా ల్లో నీరు నిల్వ లేకుండా ఉండేలా చర్యలు చేపట్టారు. ప్రస్తుత సీజన్‌లో అంటువ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందని, ప్రజలంతా పరిసరాల పరిశుభ్రత పాటిస్తే సీజనల్ వ్యాధులు దరిచేరవచ్చన్నారు. పంచాయతీ అధికారులు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి, డ్రైనేజీల్లో పూడికతీత పనులు చేపడుతూ ప్రజారోగ్య పరిరక్షణకు పాటుపడాలని ఎంపీడీవో సూచించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్య నిర్వహణ పనులను పర్యవేక్షించారు.

వెలగపూడిని కలిసిన ఎమ్మెల్యే నల్లమిల్లి




అనపర్తి, జూలై 13: టీడీపీ సీనియర్ నాయకుడు వెలగపూడి గోపాలకృష్ణను శనివారం విజయవాడలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి ఎన్టీఆర్, చంద్రబాబులకు అప్పుడిగా ఉంటూ పార్టీ అభివృద్ధికి వెలగపూడి కృషి చేశారన్నారు. తన తండ్రి నల్లమిల్లి మూలారెడ్డితో ఆయన అత్యంత సాన్నిహిత్యంతో మెలిగేవారని అన్నారు.

ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ

గోకవరం, జూలై 13: సంకురాత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు ఆర్థిక సాయంతో సమకూర్చిన కళ్లజోళ్లను శనివారం 120 మందికి అందజేశారు. అలాగే మరో 20మందికి కంటి శస్త్ర చికిత్సలు చేయించారు. కార్యక్రమంలో రామసేన సభ్యులు తామర్ల రాంబాబు, మామిడి అయ్యప్ప, ఇనగోటి బాపన్నదొర, జగన్నాథశర్మ తదితరులు పాల్గొన్నారు.

పందలపాక విద్యార్థిని ట్రిపుల్ ఐటీకి ఎంపిక



బిక్కవోలు, జూలై 13: పందలపాక ఉన్నత పాఠశాల నుంచి ట్రిపుల్ ఐటీకి కానూరి దివ్యశ్రీ ఎంపికయ్యిందని హెచ్‌ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి శనివారం తెలిపారు. పదో తరగతిలో అత్యధిక మార్కులు రావడంతో నూజివీడులోని ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినిని ఎస్ఎంసీ చైర్మన్ కోనాల సత్తిరాజు, ఉపాధ్యాయులు అభినందించారు.

హుండీల దొంగ దొరికాడు

సీతానగరం, జూలై 13: మండలంలోని రఘుదేవపురం కోటదుర్గమ్మ ఆలయం వద్ద శుక్రవారం అర్ధరాత్రి హుండీలో నగదు దొంగిలిస్తున్న వ్యక్తిని స్థానికులు పట్టుకున్నారు. పట్టుకున్న దొంగను స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. ఎస్ఐ టి.రామకృష్ణ వివరాల ప్రకారం.. రంప యర్రంపాలెం గ్రామానికి చెందిన ప్రగడ నాగశివ ధవళేశ్వరంలో ఉంటున్నాడు. శుక్రవారం రాజమహేంద్రవరంలో తన స్నేహితుడు గెడ్డం శివతో కలసి బైక్‌పై రఘుదేవపురం యనమదల రామాలయం వద్ద హుండీలో నగదు దొంగిలించారు. తర్వాత చినకొండేపూడిలో వడ్లమూరు సీతారామరాజు మోటారుసైకిల్ దొంగిలించారు. ఒక మోటార్‌సైకిల్ సీతానగరంలో ఉంచి కోరుకొండ వెళ్లి నరసింహస్వామి ఆలయంలో హుండీలో నగదు దొంగిలించారు. అక్కడి నుంచి మోటార్‌సైకిల్ కోసం సీతానగరం వచ్చి తిరిగి వెళ్తూ రఘుదేవపురం కోటదుర్గమ్మ ఆలయం హుండీలో నగదు దొంగిలిస్తుండగా స్థానికుడు గమనించి నాగశివను పట్టుకోగా గెడ్డం శివ మోటార్‌సైకిల్‌పై పరారయ్యాడు. వారి నుంచి రూ.31 వేల నగదు, మోటార్‌సైకిల్ స్వాధీనం చేసుకున్నారు. కోరుకొండ పోలీసులకు సమాచారం అందించగా వారు కూడా విచారణ జరుపుతున్నారని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

17న పెన్షనర్ల సంఘం జిల్లా సమావేశం

రాజమహేంద్రవరం సిటీ, జూలై 13 : రాజమహేంద్రవరం ధర్మంచర కమ్యూనిటీ హాలులో ఈనెల 17న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నామని జిల్లా అధ్యక్షుడు కెజికె మూర్తి తెలిపారు. ఉదయం 10 గంటలకు సమావేశం ఆరంభమవుతుందని చెప్పారు. సమావేశంలో కార్యదర్శి ఎం.పార్వతి, కోశాధికారి ఎం.పార్వతి, జిల్లా కోశాధికారి జి.నారాయణమూర్తి పాల్గొన్నారు.

అధునాతన సౌకర్యాలు అందిపుచ్చుకోండి

రాజమహేంద్రవరం పోస్టల్ డీఎస్ శేషారావు



బీమా చెక్కు అందజేస్తున్న జీఎస్ఎల్ సూపరింటెండెంట్

రాజానగరం, జూలై 13: తపాలాశాఖలో ప్రవేశపెట్టిన అధునాతన సౌకర్యాలను, నూతన పాలసీలను సద్వినియోగం చేసుకోవాలని రాజమహేంద్రవరం పోస్టల్ డివిజనల్ సూపరింటెండెంట్ కె.శేషారావు పేర్కొన్నారు. రాజమహేంద్రవరం తపాలా డివిజన్, ఇండియా పోస్ట్ చెల్లింపుల బ్యాంకు సమన్వయంతో జీఎస్ఎల్ మెడికల్ కళాశాల, జనరల్ ఆసుపత్రిలో గ్రూప్ యాక్సిడెంట్ గార్డ్(జీఏజీ)గ్యాగ్ పాలసీల అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. శేషారావు మాట్లాడుతూ ఇండియా పోస్ట్ చెల్లింపుల బ్యాంక్ వివిధ బహుళ జాతి బీమా సంస్థల భాగస్వామ్యంతో రూ.555 వార్షిక ప్రీమియంతో ప్రమాద బీమా పాలసీలను సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. దీనిలో భాగంగా రూ.399 అతి తక్కువ ప్రీమియంలో పాలసీ తీసుకుని దురదృష్టవశాత్తూ దేవీపట్నం వద్ద రోడ్డు ప్రమాదంలో మరణించిన పాలసీదారుడు వనుమర్తి రామకృష్ణ నామినీ నాగమణికి, పలాస రైల్వే స్టేషన్‌లో కదులుతున్న రైలులో అకస్మాత్తుగా జారిపడి మరణించిన మరో పాలసీదారుడు బావిశెట్టి నారాయణరావు నామినీ రేవతికి బీమా ప్రయోజన నగదు మొత్తం ఒక్కొక్కరికి రూ.10 లక్షలు వంతున చెక్కు రూపంలో జీఎస్ఎల్ ఆసుపత్రి సూపరిండెంటెండ్ టీవీఎస్పీ మూర్తి, అదనపు మెడికల్ సూపరింటెండ్ ఎం.హరిబాబు చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఇండియా పోస్ట్ చెల్లింపుల బ్యాంక్ రాజమహేంద్రవరం బ్రాంచ్ మేనేజర్ రాజేంద్రనాయుడు, అసిస్టెంట్ మేనేజర్ రేవంత్, ఝాన్సీ, జీఎస్ఎల్ మెడికల్ కళాశాల సబ్‌పోస్ట్ మాస్టర్ వై.లింగయ్య, తపాలా సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాక్టీరియా నిర్మూలనకు డ్రైడే : ఈవోపీఆర్డీ

అనపర్తి, జూలై 13: మంచినీటి ట్యాంకుల నుంచి బ్యాక్టీరియా వ్యాప్తి చెందకుండా శనివారం డ్రైడే కార్యక్రమం నిర్వహించినట్టు ఈవోపీఆర్డీ పద్మజ తెలిపారు. వాటర్ ట్యాంకుల నుంచి బ్యాక్టీరియా ప్రబలకుండా ఉండేందుకు జిల్లా వ్యాప్తంగా అన్ని ఓవర్‌హెడ్ ట్యాంకులను ఒకే సమయంలో శుభ్రపరచాలన్న కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని 29 వాటర్ ట్యాంకులను ఒకే సమయంలో శుభ్రపరిచామన్నారు. ట్యాంక్‌ను ఐదు గంటలు డ్రైగా ఉంచామని అనంతరం ట్యాంక్‌లో క్లోరినేషన్ నిర్వహించామన్నారు.

ప్రజలను చైతన్య పరచాలి.. డయేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా ప్రజలను చైతన్యం చేయవలసిన బాధ్యత వైద్య, అంగన్‌వాడీ సిబ్బందిపై ఉందని ఈవోపీఆర్డీ పద్మజ అన్నారు. శనివారం అనపర్తిలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన అవగాహనా కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. గ్రామాల్లో వైద్య అంగన్‌వాడీ సిబ్బంది సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించడమే కాకుండా తీసుకోవాల్సిన చర్యలను వివరించాలని సూచించారు.

18న వారాహి మాతకు చందనంతో అభిషేకం

కోరుకొండ, జూలై 13: మండలంలోని గాడాలలో చిన్న వేంకటేశ్వరస్వామి పీఠంలో నిర్వహిస్తున్న వారాహి మాత గుప్త నవరాత్రుల్లో భాగంగా ఈనెల 18న ఉదయం 9గంటలకు అమ్మవారికి 108 కిలోల చందనంతో అభిషేకం నిర్వహించనున్నట్టు పీఠాధిపతి గురుగోవింద చిన్నవెంకన్నబాబు స్వామిజీ తెలిపారు. ఈ మేరకు పోస్టర్‌ను శనివారం పీఠంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్వామిజీ మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో తొలిసారిగా వారాహి మాతకు 108 కిలోల చదనంతో అభిషేకం చేస్తున్నామన్నారు. గుప్త నవరాత్రుల్లో అమ్మవారికి అభిషేకం చేసిన చందనాన్ని భక్తులకు ప్రసాదంగా అందజేస్తామన్నారు. ముందుగా వారి గోత్రనామాలతో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంస్థ జాతీయ చైర్మన్ దుర్గావెంకట హేమావతి, సర్దార్ తిరుమలరాజు, వెంకటరాజు, వి.సాయికృష్ణ పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ నిజాయితీ

ప్రయాణికురాలు మర్చిపోయిన బ్యాగ్ అందజేత




పోలీసుల సమక్షంలో బ్యాగ్‌ను అందజేస్తున్న ఆటోడ్రైవర్ శ్రీనివాస్

ధవళేశ్వరం, జూలై 13: ప్రయాణికులు ఆటోలో మర్చిపోయిన బ్యాగ్‌ను వా రికి అందించి ఆటో డ్రైవర్ తన నిజాయితీని నిరూపించుకు న్నాడు. రాజమహేంద్రవరంలోని ఒక బ్యాంక్‌లో పని చేస్తున్న కేఎల్ శిరీష శుక్రవారం సాయంత్రం రైల్వేస్టేషన్ వద్ద ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వెళ్లేందుకు ఆటో ఎక్కింది. కాంప్లెక్స్ వద్ద ఆటో దిగే సమయంలో ఒక బ్యాగ్‌ను మర్చిపోయింది. తన కోసం వేచి చూస్తున్న భర్త వద్దకు చేరుకునే సమయంలో బ్యాగ్‌ను ఆటోలో మర్చిపోయినట్టు గుర్తించి ప్రకాష్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ కేవీఎస్ సత్యనారాయణ పరిసరాల్లోని సీసీ ఫుటేజీని పరిశీలించడంతో పాటు వాట్సాప్ గ్రూపుల్లో ఈ విషయాన్ని సర్క్యులేట్ చేశారు. ధవళేశ్వరంలోని కంచర్‌లైన్‌కు చెందిన ఆటో డ్రైవర్ కురందాస్ శ్రీనివాస్ తన ఆటోలోనే శిరీష ఎక్కినట్టు గుర్తెరిగి ఆ బ్యాగ్ తన ఆటోలోనే ఉన్నట్టు గుర్తించాడు. స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వచ్చి బ్యాగ్ అందజేశారు. దీంతో ఎస్ఐ విక్రాంతికుమార్ ప్రకాష్‌నగర్ సీఐకు సమాచారం అందించారు. శిరీష దంపతులు ధవళేశ్వరం పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని డీఎస్పీ అంబికా ప్రసాద్, ఎస్ఐ క్రాంతికుమార్ సమక్షంలో బ్యాగ్‌ను అందుకుని పరిశీలించారు. బ్యాగ్‌లో ఉంచిన మంగళసూత్రాల గొలుసు, చైన్, బంగారు గాజులు, నల్లపూసల గొలుసు, ఉంగరం భద్రంగా ఉన్నట్టు గుర్తించారు. శ్రీనివాస్ నిజాయితీని అభినందిస్తూ రూ.5 వేలు నగదును అందజేశారు. ఆటో డ్రైవర్‌ను జిల్లా ఎస్పీ జగదీష్‌తోపాటు డీఎస్పీ అభినందించారు.

టీటీ పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం

రాజమహేంద్రవరం కల్చరల్, జూలై 13: స్థానిక నారాయణపురంలోని ఆర్ఎంసి సిటీ బ్యాడ్మింటన్ కోర్టులో జరుగుతున్న ఏపీ స్టేట్ ర్యాంకింగ్ టేబుల్ టెన్నీస్ పోటీల్లో రెండో రోజున అండర్-19, అండర్-17 విభాగాల్లో విజేతలకు బహుమతి ప్రదానం జరిగింది. టీటీ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు విశ్వనాథం భాస్కరరామ్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పోటీలకు ముఖ్యఅతిథులుగా రోటరీక్లబ్ రాజమహేంద్రవరం అధ్యక్షుడు నాళం నరసింహారావు, ఏపీటీటీఏ ఉపాధ్యక్షుడు సీహెచ్ విజయప్రకాష్, కార్యదర్శి పి.విశ్వనాథ్ విచ్చేసి విజేతలకు బహుమతులు అందజేశారు. అండర్-19 విభాగంలో రాజమహేంద్రానికి చెందిన టి.ప్రభాత్‌సాయి, అనంతపురానికి చెందిన శ్రేష్ట ద్వితీయ బహుమతులు సాధించారు.





గోదారి పరుగులు : ధవళేశ్వరం బ్యారేజీ వద్ద సముద్రంలోకి విడుదల చేసిన నీరు

తూర్పు ఎస్పీగా నరసింహ కిషోర్

ప్రస్తుత ఎస్పీ జగదీశ్ బదిలీ



రాజమహేంద్రవరం, జూలై 13(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి ఎస్పీగా డి.నరశింహ కిశోర్ నియమితులయ్యారు.ఇప్పటి వరకూ ఎస్పీగా విధులు నిర్వర్తించిన పి.జగదీశ్‌ని డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాల్సిందిగా ఉత్తర్వులు విడుదలయ్యాయి.రాష్ట్రంలో 37 మంది ఐపీఎస్‌లకు స్థాన చలనం కలిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకొంది. 2013 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అయిన కిషోర్ తిరుమలలోని చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ అధికారిగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వస్తున్నారు. 2017 బ్యాచ్‌కి చెందిన జగదీశ్ గతేడాది సెప్టెంబరు 8న ఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు.చంద్రబాబు జైలులో ఉన్నప్పుడు..ప్రధాని పర్యటన.. సార్వత్రిక ఎన్నికల వంటి కీలక సమయాల్లో పటిష్ఠమైన భద్రత ఏర్పాట్లు చేసి సమర్థవంతమైన అధికారిగా పేరు తెచ్చుకున్నారు.ఎస్పీ జగదీశ్‌పై ఇసుక విషయంలో విమర్శలు ఉన్నాయి. అప్పటి కలెక్టర్ మాధవీలత వైసీపీ నాయకులకు కొమ్ముకాస్తూ ఇసుక డ్రెడ్జింగ్ జరగడం లేదని కోర్టుకు సమర్పించిన నివేదికలో ఆయన కూడా వాస్తవానికి విరుద్ధంగా ప్రవర్తించారనే ఆరోపణ ఉంది. ఎస్‌ఐల బదిలీల్లోనూ వైసీపీ నాయకుల మాట విని పోస్టింగ్‌లు ఇచ్చారని వినికిడి. ప్రజాప్రతినిధుల అభ్యర్థనకు నిఘా వర్గాల నివేదికకు పొంతన కుదరక పోవడమే బదిలీకి కారణంగా చెబుతున్నారు. జిల్లాకు వస్తున్న నరశింహ కిశోర్ వైసీపీ ప్రభుత్వంలో మంత్రిగా చేసిన ధర్మాన ప్రసాదరావుకు అతి భక్తుడని సమాచారం.



బొమ్మూరులో వాటర్ ట్యాంక్ వద్ద సూచనలు చేస్తున్న దినేష్‌కుమార్

ఓహెచ్‌ఆర్‌లు శుభ్రం చేసి ఫొటోలు అప్‌లోడ్ చేయండి

- 4 రోజుల పాటు ఉద్యోగులకు సెలవుల్లేవ్
- ఇన్‌చార్జి జేసీ దినేష్‌కుమార్ ఆదేశం

రాజమహేంద్రవరం, జూలై13(ఆంధ్రజ్యోతి)/రాజమహేంద్రవరం రూరల్ : జిల్లాలోని సీజనల్ వ్యాధులను వ్యాప్తి చెందకుండా చేయడానికి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాలలో శనివారంఢ్రైడే పాటించడంతో పాటు జిల్లా వ్యాప్తంగా అన్ని ఓహెచ్‌ఆర్‌లలోని నీటిని తీసేసి, క్లోరినేషన్ చేశామని జిల్లా ఇన్‌చార్జి జేసీ కె.దినేష్‌కుమార్ తెలిపారు. డ్రైడే నిర్వహణలో భాగంగా బొమ్మూరు, కడియం ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేసినట్టు తెలిపారు. జిల్లా స్థాయి,డివిజనల్, మండల స్థాయి అధికారుల తో క్షేత్ర స్థాయిలో పర్యటించి ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు దిశా నిర్దేశం చేసి నట్టు చెప్పారు. జిల్లాలోని వాటర్ ట్యాంకుల నిర్వహణ రిజిస్టర్‌లో క్లీనింగ్, క్లోరినేషన్ వివరాలు నమోదు చేయాలన్నారు. అన్ని ఓవర్‌హెడ్ ట్యాంకుల ఫొటోలు క్లీనింగ్‌కు ముందు, తర్వాత కూడా అప్‌లోడ్ చేయాలన్నారు. గ్రామాల్లో వాటర్ ట్యాంక్‌లను పూర్తిస్థాయిలో శుభ్రం చేసి చేసిన తర్వాత ప్రజలకు నీరు సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయనతో ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా అధికారులు, స్పెషల్ ఆఫీసర్లు ఆయా మండలాల్లో పర్యటిచారు.డీపీవో రాంబాబు నిడదవోలు తదితర ప్రాంతా ల్లో పర్యటించారు.రానున్న నాలుగు రోజుల పాటు జిల్లాలో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులెవరూ సెలవులు తీసుకోవద్దని ఆదేశించారు. ఇదిలా ఉండగా కడియం పర్యటనకు ఇన్‌చార్జి జేసీ వచ్చిన సమయంలో ఎంపీడీవో రాజ్‌మనోజ్, కడియం, వేమగిరి కార్యదర్శులు ఎం. శ్రీనివాసరెడ్డి, కేవీఎస్ఎస్ఎన్.రాజశేఖర్ హాజరుకాకపోవడంతో డీపీవో రాంబాబు షోకాజ్ నోటీస్ జారీ చేశారు.ఆయన వెంట ఇన్‌చార్జి ఆర్‌డీవో నాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ డి.బాల శంకరరావు, ఎంపీడీవో డి. శ్రీనివాస్ ఉన్నారు.



మొక్కలు బతికేనా : కడియం నర్సరీలో నీట మునిగిన మొక్కలు

రోడ్డేదీ : కొవ్వూరులో రహదారి గోతుల్లో నిలిచిన వాన నీరు

ముంచిన వాన

రోజంతా వదలని ముసురు

- స్తంభించిన జనజీవనం
- 19 మండలాల్లోనూ వాన
- పల్లపు ప్రాంతాలు జలమయం
- రోడ్లపై నిలిచిన నీరు
- ముంపులో వరి చేలు
- అన్నదాతల ఆందోళన
- చెట్టుపడి యువకుడి మృతి

రాజమహేంద్రవరం అర్బన్/కడియం, జూలై 13 : రోజంతా ముసురు వదల్లేదు. ఉదయం నుంచి రాత్రి వరకూ ఏకధాటిగా వాన పడుతూనే ఉంది. ఏ మాత్రం గ్యాప్ లేకుండా వర్షం కురవడంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా జిల్లాలోని పలు గ్రామాలు జలమయంగా మారాయి. చేలన్నీ నీట మునిగాయి. రోడ్లు, వీధులు వాన నీటితో నిండిపోయాయి. ధవళేశ్వరం నుంచి వయా వేమగిరి మీదుగా కాకినాడ వెళ్లే రహదారి భారీ గుంతలు ఉండడంతో పాటు ఆయా గుంతల్లో వర్షపు నీరు చేరి ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారింది. దీంతో ద్విచక్ర వాహనదారులు కారుల్లో ప్రయాణించే వారు అవస్థలు పడుతున్నారు. ప్రజల దైనందిన కార్యక్రమాలకు తీవ్ర విఘాతం ఏర్పడింది. రోజంతా వాన పడుతూనే ఉండడంతో ప్రజలు అత్యవసరమైతేనే తప్ప బయటకు రావడానికి ఆసక్తి చూపలేదు. దీంతో చిరువ్యాపారులు బేరాల్లేక డీలా పడ్డారు. పెద్ద వ్యాపారులపైనా వర్షం ఎఫెక్ట్ పడింది. కడియంలో నర్సరీలలో మొక్కలు నీట ముని గాయి. నీరు నిల్వ ఉండడం వల్ల మొక్క వేరు భాగం కుళ్లి పోయి పాడయ్యే ప్రమాదం ఉందని నర్సరీరైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు వర్షం తగ్గేవరకు మొక్కలు తీయడం, మొక్కలను ఎగుమతి చేసి రవాణా చేయడం నిలివేవేస్తామని రైతులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా కడియం ఆవ ప్రాంతాన్ని శనివారం తహశీల్దారు బి.రమాదేవి పరిశీలించారు. ఎగువ నుంచి వచ్చే నీరు ఆపించాలని లేకుంటే ఆలస్యంగా వేసిన వరి నాట్లతో పాటు గతంలో నాట్లు వేసిన పొలాలు కూడా పాడయ్యే ప్రమాదం ఉందని రైతులు తెలిపారు. దీంతో తహశీల్దార్ రమాదేవి ఇరిగేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. రాజమహేంద్రవరం మెయిన్‌రోడ్డులో ప్రజల రద్దీ కనిపించలేదు. దానవాయిపేట, తాడితోట ప్రాంతాల్లోని వ్యాపారాలపైనా వర్షం ప్రభావం పడింది. ఒక మోస్తరు వాన పడడంతో రోడ్లన్నీ చిత్తడిగా మారాయి. కోటిలింగాలపేట, ఆదెమ్మదిబ్బ,శ్యామలా సెంటర్, ఇన్నీసుపేట వంటి ప్రాంతాల్లో చిత్తడి, బురదతో ప్రజలు అవస్థలు పడ్డారు. కోటిలింగాలపేట నుంచి ఐఎల్‌టీడీ జంక్షన్ వరకూ గోదావరి గట్టును ఆనుకుని ఉన్న పల్లపు ప్రాంతాల్లోని ప్రజలు ఈ ముసురు కారణంగా తీవ్ర అసౌకర్యానికి లోనయ్యారు. శనివారం రాజమహేంద్రవరంలో 28 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఆదివారం కూడా ఇదే ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణశాఖ సమాచారం.ఈ నేపథ్యంలో మరో రెండు రోజుల పాటు ముసురు వదిలే సూచనలు కనిపించడంలేదు.ఈ పరిస్థితుల్లో సంబంధిత అధికారులు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిసారించడంతో పాటు తాగునీటి సరఫరాలో అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉందని ప్రజల నుంచి వినతులు వినిపిస్తున్నాయి.

48 గంటలు తెరిపివ్వని వాన

రాజమహేంద్రవరం సిటీ, జూలై 13: గడచిన 48 గంటలుగా తూర్పుగోదావరి జిల్లాలో ఎడతెరపిలేకుండా వర్షం కురుస్తోంది. చెదురుమొదరు జల్లులతో కూడిన వాన పడింది.జిల్లా వ్యాప్తంగా 19 మండలాల్లో శుక్ర, శని వారాల్లో వర్షం పడుతూనే ఉంది.శుక్రవారం రాత్రి నుంచి వర్షంఎడతెరిపి లేకుండా కురుస్తూనే ఉంది.జిల్లాలో అత్యధికంగా తాళ్ళపూడి మండలంలో 41.4 మి. మీ వర్షపాతం నమోదు కాగా అత్యల్పంగా బిక్కవోలు మండలంలో 3.2 మి.మీ వర్షపాతం నమోదైనట్టు వాతావరణ శాఖ తెలిపింది. అనపర్తి మండలంలో 6.8 మి.మీ, గోకవరంలో 15.0 మి.మీ, కడియంలో 37.2 మి.మీ, రాజమహేంద్రవరం రూరల్‌లో 36.4 మి.మీ, రాజమహేంద్రవరంలో 23.4 మి.మీ,రాజానగరంలో 6.2 మి.మీ,రంగంపేటలో 4.2 మి.మీ,సీతానగరంలో 36.0 మి.మీ వర్షపాతం నమోదైంది.కొవ్వూరు డివిజన్ చాగల్లు మండలంలో 22.2 మి.మీ, దేవరపల్లిలో 34.4 మి.మీ, గోపాలపురంలో 37.2 మి.మీ, కొవ్వూరులో 22.8 మి.మీ, నల్లజర్లలో 32.4 మి.మీ, నిడదవోలులో 17.2 మి.మీ,పెరవలిలో 22.8 మి.మీ,ఉం డ్రాజవరంలో 17.2 మి.మీ నమోదైంది.జిల్లాలో 441.4 మి.మీ ల వర్షపాతం నమోదైంది.సగటున 23.4 శాతంగా ఉంది.



వరుణుడు..ముంచేశాడు : దేవరపల్లి మండలం బందపురంలో నీట మునిగిన వరి చేలు

పెరుగుతున్న గోదారి

ధవళేశ్వరం, జూలై 13 : ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా వాగులు, వంకలు నుంచి వచ్చి చేరే నీటితో ధవళేశ్వరం వద్ద గోదావరి ఉధృతి పెరిగింది. ధవళేశ్వరం ఆర్మ్‌లోని 70 గేట్లకు 60 గేట్లు, ర్యాలీ ఆర్మ్‌లోని మొత్తం 43 గేట్లు, మద్దూరు ఆర్మ్‌లోని మొత్తం 23 గేట్లు, విజ్జేశ్వరం ఆర్మ్‌లోని 39 గేట్లకు 20 గేట్లను శనివారం సాయంత్రానికి 20 మిల్లీమీటర్ల మేర పైకి ఎత్తి 99,368 క్యూసెక్కులు జలాలను దిగువకు విడుదల చేస్తున్నారు.ధవళేశ్వరం వద్ద గోదావరి నీటిమట్టం 10.90 అడుగులుగా నమోదైంది. వ్యవసాయ అవసరాలకు తూర్పుడెల్టాకు 3500 క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 1200 క్యూసెక్కులు,పశ్చిమడెల్టాకు 6 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.పోలవరం ఎగువన అన్ని ప్రాంతాల్లో నీటిమట్టం నిలకడగా ఉంది.



మృతిచెందిన యువకుడు కువలేష్

చెట్టు విరిగిపడి యువకుడి మృతి

పెరవలి,జూలై13 : యువకుడిపై చెట్టు విరిగిపడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్ఐ ఏజీఎస్ మూర్తి తెలిపిన వివరాల ప్రకారం. చాగల్లుకు చెందిన మల్లుల కువలేష్ (25) కె.గంగవరం మండలం పేకేరులో బంధువుల ఇంటికి మోటారు సైకిల్‌పై వెళ్లి శనివారం ఉదయం తిరిగి బయలుదేరాడు. ఇదిలా ఉండగా శనివారం 11.30 సమయంలో జాతీయ రహదారిపై ఖండవల్లి కోళ్ళఫారం వద్దకు వచ్చేసరికి రోడ్డుపక్కన ఉన్న చెట్టు ఒక్కసారిగా కూలి యువకుడిపై పడింది.దీంతో అతని తలకు బలమైన గాయం కాగా తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే చనిపోయినట్లు తెలిపారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

50 హెక్టార్లలో వరి చేలు మునక

జిల్లా వ్యవసాయాధికారి ఎస్. మాధవరావు

రాజమహేంద్రవరం, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎడతెరపిలేని వర్షాల కారణంగా 50 హెక్టార్లలో వరి నాట్లు నీట మునిగాయని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు తెలిపారు. నాలుగైదు రోజుల వరకూ నీరు ఉన్నా నష్టం ఉండదని, రైతులు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని కోరుకొండ మండలం మునగాలలో 10 హెక్టార్లు, తాళ్లపూడి మండలం తిరుగుడుమెట్టలో 15 హెక్టార్లు, పెద్దేవంలో 5 హెక్టార్లు, గోపాలపురం మండలం చిట్యాలలో 20 హెక్టార్లలో వరి నీట మునిగిందన్నారు.జిల్లాలో వరి పంట 90 శాతం సాగవుతుండగా ఇప్పటి వరకూ 52 శాతం నాట్లు పూర్తయ్యాయన్నారు. ప్రస్తుత వర్షాల వల్ల పంటలకు ఎటువంటి నష్టం లేదని..అధికంగా ఉన్న నీటిని తమ పంట నుంచి బయటకు తీసే ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో వర్షం తగ్గే వరకూ వరినాట్లు తాత్కాలికంగా నిలిపివేయడం వల్ల నారు వృథా కాదన్నారు.



పోలీసులతో కలిసి లక్ష్మీనరసింహుడి హుండీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

రెండేళ్లు.. మూడు చోరీలు

కోరుకొండ లక్ష్మీనరసింహుడి ఆలయానికి భద్రత కరువు

కోరుకొండ, జూలై13:చారిత్రాత్మక కోరుకొండ శ్రీ లక్ష్మి నరసింహస్వామి దేవస్థానానికి భద్రత కరువైంది. గత 12 ఏళ్లుగా అన్నవరం దేవస్థానం దత్తత దేవాలయంగా కొనసాగుతున్న ఆలయంలో గడిచిన రెండేళ్లలో మూడు సార్లు హుండీలు అపహరణకు గురయ్యాయి. అయినప్పటికీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా శనివారం తెల్లవారుజామున ప్రధాన ఆలయ ముఖద్వారం ఏర్పాటు చేసిన హుండీని పగలకొట్టి సొమ్ము దోచుకుపోయారు. గతంలో రెండు సార్లు కొండపైన హుండీలు పగలకొట్టగా ఇప్పుడు కొండ దిగువున హుండీని పగలకొట్టారు. అయితే దొంగలు రఘుదేవపురంలోని మరో ఆలయం వద్ద దొంగతనానికి పాల్పడుతున్న సమయంలో చాకచక్యంగా గ్రామస్తులు ఒక పట్టుకుని సీతానగరం పోలీసులకు అప్పగించారు. అయితే మరో దొంగ పరారైనట్టు తెలిపారు. పట్టుకున్న దొంగను కోరుకొండ దేవస్థానం సీసీ కెమెరా ఫుటేజ్‌ల ఆధారంగా పోలీసులు విచారించగా నరసింహస్వామి దేవస్థాం హుండీ పగలకొట్టింది తానేనని అంగీకరించాడు.ఈ మేరకు వారి వద్ద నుంచి దేవస్థానానికి సంబంధించి రూ.31,800లను పోలీసులు రికవరీ చేశారు. దొంగలు పగలకొట్టిన హుండీని కోరుకొండ పోలీసులతో కలిసి ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పరిశీలించారు. భవిష్యత్‌లో హుండీలకు పటిష్టమైన భద్రత కల్పిస్తామన్నారు.అన్నవరం దేవస్థానం ఏలుబడిలో ఉన్న ఈ దేవస్థానంలో రాత్రిపూట ఆలయాన్ని పరిరక్షించేందుకు ఒక వాచ్‌మెన్, ఇద్దరు సెక్యూరిటీ గార్డులు ఉన్నారు.అయినప్పటికీ సెక్యూరిటీ గార్డుల నిర్లక్ష్యం కారణంగా దొంగలుసునాయాసంగా హుండీ పగలకొట్టి సొమ్ము దోచుకుపోయారని గ్రామస్తులు చెబుతున్నారు.

బడిలో.. బాగేనా!?

జిల్లాలో ప్రబలుతున్న అతిసారం





ఇది ప్రమాదం కాదా : నగరంలోని పాఠశాలల వద్ద అధ్వానంగా ఉన్న డ్రెయినేజీల్లోనే మంచినీటి పైప్‌లైన్లు

- బడుల్లో కానరాని పరిశుభ్రత
- అపరిశుభ్రంగా బాత్‌రూమ్‌లు
- చిన్నారులకు ప్రమాదం
- ముసురుతున్న సీజనల్ వ్యాధులు
- జిల్లాలో 1500 పాఠశాలలు
- కనిపించని పర్యవేక్షణ

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

పిల్లలూ జాగ్రత్త.. శుభ్రత లేకపోతే ప్రమాదం.. ఎందుకంటే అతిసారం ప్రబలుతోంది. ఒకవైపు అపారిశుధ్యం..మరోవైపు వర్షాకాలం వ్యాధులకు ఊతమిస్తున్నాయి. ఇప్పటికే పెద్దవాళ్ల ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఇదిలా ఉండగా స్కూల్ పిల్లల విషయంలో ఆందోళన నెలకొంది. ఉదయం నిద్ర లేచిన దగ్గర నుంచీ రాత్రి పడుకొనే వరకూ పిల్లలు ఎక్కువగా స్కూల్‌లోనే గడుపుతారు. అతిసారం ముఖ్యంగా పరిశుభ్రత లేకపోవడం వల్ల వస్తుంది. అతిసార పెద్దలకు సోకితే కాస్త తట్టుకునే పరిస్థితి ఉంటుంది. పిల్లలకు వస్తే చాలా వేగంగా నీరసించి ప్రాణపాయస్థితిలో చిక్కుకుంటారు. వర్షాకాలం కావడంతో ఈ వ్యాధి వేగంగా వ్యాప్తి చెందే అవకాశం లేకపోలేదు.దీంతో పాఠశాలల్లో పారిశుధ్యంపై తల్లిదండ్రుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. స్కూల్‌లో వాష్‌రూమ్‌కి వెళ్లిన తర్వాత చేతులు సబ్బుతో కడుక్కుంటున్నారో లేదో.. భోజనం చేసే ప్రదేశం క్లీన్‌గా ఉందా? అనే సందిగ్ధంలో ఉన్నారు. ప్రభుత్వ , ప్రైవేటు పాఠశాలల్లో పారిశుధ్య నిర్వహణ పేలవంగా ఉంటుందనే ఆరోపణల నేపథ్యంలో మరింత భయం నెలకొంది. ఆదేశాలు జారీ చేయడంతోనే తమ వంతు పనైపోయిందనే పోకడలోనే అధికారులు ఉంటే పిల్లలు అనారోగ్యాల బారిన పడే ప్రమాదం ఉంది.

బడుల్లో తనిఖీలు పెంచాలి..

జిల్లాలో 1200 ప్రభుత్వ, 300 వరకూ ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. వీటిలో పరిశుభ్రతపై పక్కాగా దృష్టి సారించాల్సిన అవసరం కనిపిస్తోంది. ముఖ్యంగా పాఠశాలలకు తాగునీరు సరఫరా అయ్యే పైపు లైన్లను పూర్తిగా తనిఖీ చేసి అవి డ్రైన్లకు దగ్గరగా, డ్రైన్లలో ఉంటే వెంటనే మార్పు చేయాలి. పాఠశాలల్లో, బయట డ్రైన్లు శుభ్రంగా ఉండేలా చూడాలి. అన్ని పాఠశాలల్లోనూ పరిశుభ్రమైన తాగునీరందే విధంగా చర్యలు తీసుకోవాలి. ఆర్వో ప్లాంట్లు ఉంటే వాటిని పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలి. విద్యార్థులు మల, మూత్ర విసర్జనకు వెళ్తే తప్పనిసరిగా సబ్బుతో చేతులు కడుక్కునేలా చూడాలి.అతిసారం సోకితే పెరుగు ప్రొబయోటిక్ కాబట్టి అనారోగ్యం నుంచి బయట పడ డానికి చాలా బాగా పనిచేస్తుందని వైద్యులు చెబుతు న్నారు. కానీ పాఠశాలల్లో ఎక్కడా పెరుగు వడ్డించడం లేదు. 6వ తరగతి నుంచి అక్కడక్కడా మజ్జిగ పోస్తున్నా అది అన్నంలోకి పనిచేయకపోవడంతో బాటిల్‌లో పట్టు కొని తాగే పరిస్థితి ఉంది. దాతలు ముందుకొచ్చి పాఠ శాలలకు పెరుగు వితరణ చేస్తే మంచిదేమో ఆలోచించాలి.

ఇలా చేస్తే బెటర్..

పాఠశాలల్లో పరిశుభ్రత అతి ముఖ్యంగా అమలు చేయాల్సి ఉంది. ప్రతి విద్యార్థి ఆరోగ్యాన్నీ రోజూ గమనిస్తూ ఉండాలి. విద్యార్థులు భోజనం చేసే ప్రదేశాలు, మరుగుదొడ్లు, డ్రైన్లు, పరిసరాలను కచ్చితంగా పరిశుభ్ర ంగా ఉంచాలి. చెత్తను వెంటనే స్కూల్ బయటకు తరలించాలి.తుప్పలను తొలగించాలి. చాలా పాఠశా లల్లో ఆర్వో ప్లాంట్లను దాతలు సమకూర్చినా నిర్వహణ మాత్రం పడకేసింది. పిల్లలకు పరిశుభ్రతపై టీచర్లు అవగాహన కల్పించాలి. ఇంట్లో కూడా తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. చేతులకు గోళ్ల పెరగకుండా కత్తిరిస్తూ ఉండాలి.

బడుల్లో తనిఖీలు చేస్తున్నాం..



వేడి నీళ్ల మరగబెట్టి చల్లార్చి ఇవ్వాలని ఆదేశాలిచ్చాం. ఎవరికైనా ఎక్కువ దాహం వేసినా, బాత్‌రూంకి వెళుతున్నా.. అనారోగ్య సూచనలు ఉంటే వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్ల మన్నాం. స్కూల్స్‌లో పూర్తిగా బ్లీచింగ్ చల్లించాం. ప్రతి శుక్రవారం డ్రైడే పాటిసున్నాం. వాటర్ ట్యాంకులను శుభ్రం చేయిస్తున్నాం. రోజూ పాఠశాలలను ఆకస్మిక తనిఖీలు చేసి ఇబ్బందులు ఉంటే అప్పటికప్పుడు సరిచేస్తున్నాం.

- కె.వాసుదేవరావు, జిల్లా పాఠశాల విద్యాధికారి

చేతులు శుభ్రంగా ఉంచుకోవాలి



పిల్లల విషయంలో నిర్లక్ష్యంగా ఉండకూడదు. ఎప్పుడూ కాచి వడపోసిన నీళ్ల కొంచెం గోరు వెచ్చగా తాగాలి. చేతులు శుభ్రంగా కడిగిన తర్వాతే ఆహారం తీసుకోవాలి. వాష్‌రూంకి వెళ్లొచ్చాక కూడా అంతే. స్కూల్ వాష్‌రూమ్‌లు రోజూ మూడు సార్లు క్లీన్ చేయించాలి. సీజనల్ వ్యాధులు రాకుండా వ్యాక్సిన్‌లు వేయించాలి. నీళ్ల పరిశుభ్రంగా కచ్చితంగా ఉండాలి. వాటర్‌బాటిల్ షేరింగ్ ఉండకూడదు.

- కొండా ఉమా శివరామకృష్ణ, పిల్లల వైద్యుడు

ఆర్యాపురం అర్బన్ బ్యాంక్ పోరు..హోరు

11 డైరెక్టర్ల పదవులకు 34 మంది పోటీ

రాజమహేంద్రవరం,జూలై 13 (ఆంధ్రజ్యోతి) : ఆర్యాపురం అర్బన్ బ్యాంక్ ఎన్నికలు ఈనెల 20 జరగనున్నాయి. పోటీలో మొత్తం 34 మంది ఉన్నారు. 12 మంది డైరెక్టర్లకు ఇప్పటివకే ఒకరు ఏకగ్రీవం అయ్యారు. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి చైర్మన్ అభ్యర్థిగా మాజీ చైర్మన్ చల్లా శంకరరావు ఉండగా, వైసీపీ మద్దతుతో చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ ప్రెసిడెంట్, వైసీపీ మాజీ టౌన్ ప్రెసిడెంట్ నందెపు శ్రీనివాస్‌ను తెర మీదకు తీసుకొచ్చారు. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలు, విశాఖ, గుంటూరు జిల్లాల్లో 16 బ్రాంచిలు ఉన్న ఈ బ్యాంక్ ఎన్నికల్లో 78,423 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. టీడీపీ కూటమి ప్యానల్ నుంచి చైర్మన్ అభ్యర్థిగా చల్లా శంకరరావు,బీజేపీ తరపున యెనుమల రంగబాబు, జనసేన తరపున కప్పల సూర్యప్రకాష్,టీడీపీ మద్దతుతో పోలాకి పరమేశ్, పిల్లి శ్యామ్, ఎర్రమోతు ధర్మరాజు, కాకినాడ నుంచి సింగంపల్లి రామకృష్ణ, దివాన్‌చెరువు నుంచి నీలపాల సూర్య సత్యనారాయణ, యాళ్ల వెంకట్రావు, ముగిది శ్రీనివాస్, పడాల శ్రీను ,బుడ్డిగ రవి పోటీలో ఉన్నారు. వైసీపీ మద్దతుతో ముందుకు వచ్చిన ప్యానల్‌లో నందెపు శ్రీనివాస్ చైర్మన్ అభ్యర్థి కాగా డైరెక్టర్ల పదవి రేసులో లంకా సత్యనారాయణ, ఆకుల శ్రీనివాస్, దూడల త్రినాథ్, కె.రాజేష్, నందం కుమార్‌రాజా, పి.సురేష్, పెదిరెడ్ల శ్రీనివాస్, నందూరి సుబ్బారావు, సీపీఐ నుంచి వి.రాంబాబు, గంగిశెట్టి సోమేశ్వరరావు ఉన్నారు. స్వతంత్రులు, ఇతరులు పోటీ పడుతున్నారు. 20వ తేదీన పోలింగ్ నిర్వహిస్తారు. 22న కొత్త చైర్మన్‌ను ఎన్నుకుంటారు.

అక్రమ ఇసుక రవాణాపై 9 కేసులు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 13 : జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వారిపై 9 కేసులు నమోదు చేశామని జిల్లా ఇన్‌చార్జి జేసీ దినేష్ కుమార్ తెలిపారు. ఈ మేరకు జేసీ శనివారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో ఈనెల 9 నుంచి ఉచిత ఇసుక అమ్మకం ప్రారంభించామని తెలిపారు. గోదావరి వరదలు పెరుగుతున్నందున డీసిల్టేషన్ పాయింట్ల వద్దే ఇసుకను పంపిణీ చేస్తారని తెలిపారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6గంటల వరకు మాత్రమే పంపిణీ చేస్తారని తెలిపారు. అటుపై స్టాక్ పాయింట్ల వద్ద సరఫరా చేస్తారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్న 9 వాహనాలు సీజ్ చేశామని తెలిపారు. జిల్లాలో ఇసుక రవాణాపై కట్టుదిట్టమైన నిఘా వ్యవస్థ అమలు చేస్తున్నట్టు చెప్పారు.

సురక్షిత తాగునీరందించండి
ఇన్‌చార్జి జేసీ దినేష్‌కుమార్ ఆదేశం 6
ట్రాక్టర్‌ను ఢీకొని యువకుడి మృతి
17న పెన్షనర్ల సంఘ జిల్లా సమావేశం

ఓపీఎస్ అమలుచేయాలి

ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దుర్గారావు



తాళ్లపూడి, జూలై 13: ప్రభుత్వ ఉద్యోగులకు సీపీఎస్, జీపీఎస్ విధానం వద్దు అని ఓపీఎస్ కావాలని, కొత్త ప్రభుత్వ ఆలోచనలు కూడా గత ప్రభుత్వం మాదిరిగానే ఉన్నాయని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దున్నా దుర్గారావు ప్రకటనలో తెలిపారు. గత ప్రభుత్వం ఉద్యోగులను పట్టించుకోకుండా ఏకపక్షంగా చట్టం చేసిందని, జీపీఎస్, సీపీఎస్ కంటే దారుణమైనదని, ఉద్యోగి పదవీ విరమణ తరువాత పీఆర్సీ, హెల్త్‌కార్డులు వర్తించవని, ఏమాత్రం గ్యారెంటీ లేనిది ఈ జీపీఎస్ అని, గత ప్రభుత్వంలోనే ఈ చట్టం అమలులోకి వచ్చినట్టు జీవో విడుదల చేయడంపై ఏపీటీఎఫ్ వ్యతిరేకిస్తోందన్నారు. ఈ విషయం గుర్తించి ప్రభుత్వం వెంటనే స్పందించి జీవో 54ను రద్దు చేస్తూ ప్రకటన చేయాలని పేర్కొన్నారు.

సమిశ్రగూడెంలో డీపీవో పర్యటన



సమిశ్రగూడెంలో డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న డీపీవో రాంబాబు

నిడదవోలు, జూలై 13: మండలంలోని సమిశ్రగూడెంలో జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు పర్యటించారు.డ్రైనేజీలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు.ఇలాగుంటే రావా రోగాలు శీర్షికతో శనివారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. డీపీవో అక్కడే ఉండి డ్రెయినేజీలో సిల్ట్ తీయించారు. వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పిదాలకు పారిశుధ్యం పడకేయడంతో నేడు ప్రజలు అవస్థలు పడుతున్నారు. సమిశ్ర గూడెం మేజర్ పంచాయతీ అయినా డ్రైనేజీలు అస్తవ్యస్తంగా మారాయి.

జీపీఎస్‌కు రాజముద్ర వేయడం సరికాదు

యూటీఎఫ్ నాయకులు

ఉండ్రాజవరం, జూలై 13: గత ప్రభుత్వం తయారు చేసిన జీపీఎస్ విధానానికి ప్రస్తుత ప్రభుత్వం రాజముద్ర వేయడం సరికాదని యూటీఎఫ్ మండలాధ్యక్షుడు కుంకట్ల వెంకటరత్నం, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ఐ.రాంబాబు, మండల గౌరవాధ్యక్షుడు ఎస్.లక్ష్మీనారాయణ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యోగ సంఘాలతో చర్చలు జరిపి అందరికీ ఆమోదయోగ్యమైన విధానాన్ని అమలు పరుస్తామని, ఎన్నికల ముందు చెప్పారని వారు గుర్తు చేశారు. గత ప్రభుత్వం తయారుచేసిన జీపీఎస్‌ను అమల్లోకి తేవడం వల్ల ఉద్యోగులు చాలా నష్టపోతారన్నారు. దీనిపై పునఃసమీక్షించి ఉద్యోగ సంఘాలతో చర్చించిన అందరికీ ఆమోదయోగ్యమైన పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు.

స్వగ్రామానికి అవినాష్ మృతదేహం



అవినాష్ మృతదేహాన్ని చూస్తున్న బంధువులు

గోపాలపురం, జూలై 13: అమెరికాలో మృతిచెందిన తెలుగు విద్యార్థి గద్దె సాయిసూర్య అవినాష్ మృతదేహాన్ని స్వగ్రామం చేరుకుంది. ఈ మేరకు శనివారం ఉదయం గోపాలపురం మండలం చిట్యాల గ్రామంలో అవినాష్ మృతదేహానికి కుటుంబీకులు, బంధువులు, గ్రామస్థులు నివాళులర్పించారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు. చదువు కోవడానికి వెళ్లిన కుమారుడు విగతజీవిగా తిరిగి రావడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

పశుగ్రాసం పెంపకంపై అవగాహన



చాగల్లులో రైతులకు పశుగ్రాసం పెంపకంపై అవగాహన కలిగిస్తున్న దృశ్యం

చాగల్లు, జూలై 13: పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా రైతులకు పశుగ్రాసం పెంపకంపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల పశువైద్యాధిరి యు.ముఖేష్ మాట్లాడుతూ నూతన పశుగ్రాసం అవసరం, గడ్డికోసే యంత్రంపై అవగాహన కలిగించారు. మండలంలోని నెలటూరు, మల్లవరం, చంద్రవరం, దారవరం, మార్కొండఎడు గ్రామాల్లో పర్యటించి రైతులకు పశుగ్రాసం పెంపకంలో నూతన విధానాలపై అవగాహన కలిగించారు.

ట్రాక్టర్‌ను ఢీకొని యువకుడి మృతి



నల్లజర్ల, జూలై 13: మండలంలోని అనంతపల్లిలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. సీఐ దుర్గాప్రసాద్ వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా చీరాల సమీపంలోని జాండ్రపేటకు చెందిన కె.సంతోష్‌కుమార్ శనివారం రాజమహేంద్రవరం నుంచి విజయవాడ వెళుతుండగా అనంతపల్లి బైపాస్‌లో ముందు వెళుతున్న ట్రాక్టర్‌ను ఢీకొని అక్కడిక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

రాజమహేంద్రవరంలో యూటీఎఫ్ నిరసన



కంబాలచెరువు వద్ద జీపీఎస్ గెజిట్ ప్రతులు దహనం చేస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 13 : రాష్ట్ర ప్రభుత్వం జీపీఎస్ అమలు చేస్తూ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడం అన్యాయమని, ప్రభుత్వం పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని యూటీఎఫ్ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.జయకర్, ఏ.షరీఫ్ అన్నారు. ఈమేరకు శనివారం కంబాలచెరువు పార్కు వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. జీపీఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మానవహారం నిర్మించి గెజిట్ ప్రతులను దహనం చేశారు. ప్రస్తుత ప్రభుత్వం సీపీఎస్ ఉద్యోగులతో చర్చించకుండా జీపీఎస్ అమలు చేయడం సరికాదని, వెంటనే గెజిట్ రద్దు చేయాలని యూటిఎఫ్ నాయకులు కోరారు. ఈ కార్యక్ర మంలో నాయకులు ఎం.విజయగౌరి, వీఎస్ఆర్.ప్రసాద్, ఎం.రవిబాబు, టీఎస్.ప్రకాశరావు, శ్రీమణి, ఎం.రమేష్‌బాబు, సీహెచ్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పందలపాక విద్యార్థిని ట్రిపుల్ ఐటీకి ఎంపిక



బిక్కవోలు, జూలై 13: పందలపాక ఉన్నత పాఠశాల నుంచి ట్రిపుల్ ఐటీకి కానూరి దివ్యశ్రీ ఎంపికయ్యిందని హెచ్ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి శనివారం తెలిపారు. పదో తరగతిలో అత్యధిక మార్కులు రావడంతో నూజివీడులోని ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినిని ఎస్ఎంసీ చైర్మన్ కోనాల సత్తిరాజు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎడతెరిపిలేని వాన

- రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయం
- స్తంభించిన జనజీవనం.. వాహనదారుల ఇబ్బందులు

కొవ్వూరు/గోపాలపురం/దేవరపల్లి, జూలై 13 : ముసురు కారణంగా శనివారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో కొవ్వూరు పట్టణ, మండలంలోని రహదారులన్నీ జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లోకి వర్షపు నీరు చేరింది. మురుగుకాలువలు పొంగి రోడ్లపై ప్రవహించాయి. జనజీవనం స్తంభించింది. వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. ఉదయం నుంచి ఏకధాటిగా వర్షం కురవడంతో కార్యాలయాలకు వెళ్లే సిబ్బంది ఇక్కట్లకు గురయ్యారు. పట్టణంలోని అగ్నిమాపకశాఖ కార్యాలయం ఎదుట, పట్టణ పోలీస్‌స్టేషన్, కోర్టు ప్రాంగణంలోకి వెళ్లే రోడ్డులో, మెరకవీధి పెట్రోల్‌బంకు సెంటర్‌లో రాష్ట్ర రహదారిపై వర్షపునీరు నిలిచిపోయింది.



కొవ్వూరులో ఫైర్ ఆఫీసు వద్ద నిలిచిన వర్షపునీరు



గోపాలపురం: జగన్నాథపురం శివారులో నీట మునిగిన పామాయిల్ మొక్కలు

రహదారి గుంతల్లో వర్షపునీరు చేరడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్లపై నిలిచిన వర్షపు నీటిని తొలగించి, పారిశుధ్య చర్యలు సత్వరం చేపట్టాలని మున్సిపల్ అధికారులను పట్టణవాసులు కోరుతున్నారు. ఎడతెరిపిలేని వానతో పలు గ్రామాల్లో రహదారులు చిత్తడిగా మారాయి. ప్రస్తుత వర్షాలతో దొమ్మేరు, నందమూరు, పశివేదల గ్రామాల్లో వరిచేలు ముంపునకు గురయ్యాయి. ఇదిలా ఉండగా గోపాలపురం మండలంలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు, పంట పొలాలు నీట మునిగాయి. చిట్యాల, వెంకటాయపాలెం సమీపంలో 200 హెక్టార్ల వరినాట్లు ముంపుకు గురయ్యాయి. జగన్నాథపురం గ్రామశివారులో పామాయిల్ తోటల్లో వర్షపునీరు చేరింది. దేవరపల్లి మండలంలోని గ్రామాల్లో రోడ్లు చిత్తడిచిత్తడిగా మారాయి. డ్రైనేజీలు పొంగిపొర్లాయి. త్యాజంపూడి, గౌరీపట్నం, బంధపురం లోతట్టులో ఉన్న వరినాట్లు నీటమునిగాయి. ఇలాగే మరో రెండురోజులు పాటు వర్షాలు కురిసి పంటచేలలో నీరు నిలబడితే తీవ్ర నష్టాల పాలవుతామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంట పొలాల్లో నిలిచిన వర్షపునీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు బయటకు తీసివేయాలని అధికారులు సూచిస్తున్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

- దేవరపల్లి ఎంపీడీవో ప్రభాకర్
- పలు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు

దేవరపల్లి, జూలై 13: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పంచాయతీ కార్యదర్శులు, వైద్యఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎంపీడీవో ప్రభాకర్ అధికారులకు సూచించారు. దేవరపల్లిలో మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ ఉద్యోగులకు, పీహెచ్‌సీల సిబ్బందితో శనివారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని మంచినీటి ట్యాంకుల వద్ద బ్లీచింగ్ చల్లడం, వాటర్‌ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయడం, పరిసరాల పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. వైద్యసిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజలకు సీజనల్‌గా వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించి తీసుకోవల్సిన జాగ్రత్తలు వివరించాలన్నారు.



దేవరపల్లిలో సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రభాకర్

వాటర్ ట్యాంకుల్లో రోజూ క్లోరినేషన్ చేయాలి

ఉండ్రాజవరం, జూలై 13: గ్రామాల్లోని వాటర్ ట్యాంకుల్లో ప్రతిరోజు క్లోరినేషన్ చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీవో జేడీవీ ప్రసాద్ చెప్పారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో ఆయన పర్యటించి, రక్షిత మంచినీటి పథకాలను, పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పంచాయతీ సిబ్బందికి సూచనలు చేశారు. రక్షిత మంచినీటి ట్యాంకులు శుభ్రం చేయాలన్నారు. క్లోరినేషన్ చేసిన నీటిని ప్రజలకు అందించాలన్నారు. మురుగు నీరు నిల్వలేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్ల పక్క చెత్తాచెదారాలను ఎప్పటికప్పుడు తొలగించాలని పంచాయతీ కార్యదర్శులకు చెప్పారు. మంచినీటి కుళాయిలు వద్ద శుభ్రం చేయించాలని, లాగ్ పుస్తకాలు నమోదు చేయాలని ప్రసాద్ పేర్కొన్నారు.

దోమల వ్యాప్తిని అరికట్టాలి

కొవ్వూరు, జూలై 13: వర్షాకాలంలో ఎక్కువగా వ్యాధులు ప్రబలే ప్రమాదముందని, ప్రజలు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని దొమ్మేరు పీహెచ్‌సీ వైద్యాధికారి సూరవరపు ధర్మరాజు అన్నారు. ప్రధానంగా నీటి ద్వారా సంక్రమించే డయేరియా, టైఫాయిడ్, కామెర్లు వంటి వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశముంది.ప్రజలు కాచిచల్లార్చిన నీటిని తాగాలని, దోమలు పెరగకుండా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. డ్రైన్లలో మురుగునీరు, ఇళ్లలో ఫ్రిజ్‌ల వెనుక, వాషింగ్‌మిషను గొట్టాలు, ఎయిర్‌కూలర్లు, పాత టైర్లలో నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు.

నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి

పెరవలి, జూలై 13: ప్రస్తుతం వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదమున్నందున ప్రతి ఇంటా నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని పెరవలి ప్రాథమిక ఆరోగ్యకేంద్ర సిబ్బంది ఇంటింటా ప్రచారం చేశారు. సూపర్‌వైజర్ ఉంగట రాజేష్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ఖండవల్లిలో ప్రజలకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయా ఇళ్ల వద్ద కుండీలు, రోళ్లు, ఖాళీ డబ్బాల్లో నిల్వ ఉన్న నీటిని కిందకు పారబోశారు. ఈ సందర్భంగా దోమలు వల్ల కలిగే నష్టాలను వివరించారు. తాగి పడేసిన కొబ్బరి బొండాలు, పాత టైర్లు, గుంతల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. మురుగునీరు నిల్వ ఉన్న చోట్ల ఆయిల్ చల్లాలని ఎటువంటి చెత్తాచెదారం లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో వైద్యఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో రక్షిత మంచినీటి ట్యాంక్‌లను శుభ్రం చేయించినట్టు ఎంపీడీవో హిమమహేశ్వరి తెలిపారు..



ఉండ్రాజవరం: తాడిపర్రులో పారిశుధ్యంపై సూచనలిస్తున్న ఎంపీడీవో ప్రసాద్



పెరవలి: ఖండవల్లిలో నిల్వ ఉన్న నీటిని ఖాళీ చేస్తున్న వైద్య సిబ్బంది

ప్రజలకు సురక్షిత తాగునీరందించాలి

- ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ దినేష్‌కుమార్

కడియం, జూలై 13: వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని సీజనల్ వ్యాధులు ప్రబలకుండా సురక్షిత తాగునీటిని ప్రజలకు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ కె.దినేష్‌కుమార్ తెలిపారు. కడియం శెట్టిబలిజపేటలో పంచాయతీ, ఆర్‌డబ్ల్యుఎస్, వైద్యఆరోగ్యశాఖ అధికారులతో కలిసి ఆయన శనివారం పర్యటించి మంచినీటి ట్యాంకును పరిశీలించారు. వాటర్‌ట్యాంకులు, తాగునీటి సరఫరాపై పంచాయతీ అధికారులను ఆరా తీసారు. ప్రతి గ్రామంలో వాటర్‌ట్యాంకులను పూర్తిస్థాయిలో శుభ్రపరిచి శుద్ధిచేసిన తాగునీటిని ప్రజలకు అందించే విధంగా అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ వెలుగుబంటి నాని, డీఎల్‌పీవో ఎం.నాగలత, ఎస్ఈ బాలశంకర్, డీఈ శ్రీనివాసరావు ఉన్నారు.



కడియంలో అధికారులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి జేసీ దినేష్‌కుమార్

ఎంపీడీవో, కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు

కడియం, జూలై 13: ఎంపీడీవో జి.రాజ్‌మనోజ్, కడియం గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శి ఎం.శ్రీనివాసరెడ్డి, వేమగిరి గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శి కేవీఎస్ఎస్ఎన్ రాజశేఖర్‌లకు షోకాజ్‌నోటీసులు జారీ చేసినట్టు జిల్లా పంచాయతీ అధికారి డి.రాంబాబు తెలిపారు. ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ కె.దినేష్‌కుమార్ శనివారం కడియం పర్యటనకు వచ్చారు. ఆ సమయానికి హాజరు కాని ఎంపీడీవో, కడియం, వేమగిరి గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులకు ఇన్‌చార్జి జేసీ ఆదేశాల మేరకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్టు తెలిపారు.

సమన్వయంతో పనిచేయాలి

సీతానగరం, జూలై 13: సీజనల్ వ్యాధుల నియంత్రణకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీవో కేఎస్ఆర్ కృష్ణప్రసాద్ సూచించారు. శనివారం సీతానగరం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన మండల స్థాయి అధికారులతో సీజనల్ వ్యాధులు-నియంత్రణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సురక్షిత తాగునీరు సరఫరా, పరిసరాల పరిశుభ్రత, ఇంటి లోపల, బయట నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం తదితర అంశాలపై శ్రద్ధ పెట్టాలని ఎంపీడీవో చెప్పారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ మూర్తి డాక్టర్లు కేవీకే చైతన్య, ఎన్.రాజు, రెవెన్యూ, ఆర్‌డబ్ల్యుఎస్, ఆరోగ్య, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

18న వారాహి మాతకు చందనంతో అభిషేకం



చందనోత్సవం పోస్టర్ ఆవిష్కరిస్తున్న పీఠాధిపతి చిన్నవెంకన్నబాబు

కోరుకొండ, జూలై 13: మండలంలోని గాడాలలో చిన్న వేంకటేశ్వరస్వామి పీఠంలో నిర్వహిస్తున్న వారాహి అమ్మవారి గుప్త నవరాత్రుల్లో భాగంగా ఈనెల 18న ఉదయం 9గంటలకు అమ్మవారికి 108 కిలోల చందనంతో అభిషేకం నిర్వహించనున్నట్టు పీఠాధిపతి గురుగోవింద డాక్టర్ చిన్నవెంకన్నబాబు స్వామిజీ తెలిపారు. ఈ మేరకు పోస్టర్‌ను శనివారం పీఠంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్వామిజీ మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో తొలిసారిగా వారాహి మాతకు 108 కిలోల చదనంతో అభిషేకం చేస్తున్నామన్నారు. గుప్త నవరాత్రుల్లో అమ్మవారికి అభిషేకం చేసిన చందనాన్ని భక్తులకు ప్రసాదంగా అందజేస్తామన్నారు. ముందుగా వారి గోత్రనామాలతో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ జాతీయ చైర్మన్ దుర్గావెంకట హేమావతి, సర్దార్ తిరుమలరాజు, వెంకటరాజు, వరదా సాయికృష్ణ పాల్గొన్నారు.

హుండీల దొంగ దొరికాడు!

సీతానగరం, జూలై 13: మండలంలోని రఘుదేవపురం కోటదుర్గమ్మ ఆలయం వద్ద శుక్రవారం అర్ధరాత్రి హుండీలో నగదు దొంగిలిస్తున్న వ్యక్తిని స్థానికులు పట్టుకున్నారు. పట్టుకున్న దొంగను స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. ఎస్ఐ టి.రామకృష్ణ వివరాల ప్రకారం.. రంప యర్రంపాలెం గ్రామానికి చెందిన ప్రగడ నాగశివ ధవళేశ్వరంలో ఉంటున్నాడు. శుక్రవారం రాజమహేంద్రవరంలో తన స్నేహితుడు గెడ్డం శివతో కలసి బైక్‌పై రఘుదేవపురం యనమదల రామాలయం వద్ద హుండీలో నగదు దొంగిలించారు. తర్వాత చినకొండేపూడిలో వడ్లమూరు సీతారామరాజు మోటారుసైకిల్ దొంగిలించారు. ఒక మోటార్‌సైకిల్ సీతానగరంలో ఉంచి కోరుకొండ వెళ్లి నరసింహస్వామి ఆలయంలో హుండీలో నగదు దొంగిలించారు. అక్కడి నుంచి మోటార్‌సైకిల్ కోసం సీతానగరం వచ్చి తిరిగి వెళ్తూ రఘుదేవపురం కోటదుర్గమ్మ ఆలయం హుండీలో నగదు దొంగిలిస్తుండగా స్థానికుడు గమనించి నాగశివను పట్టుకోగా గెడ్డం శివ మోటార్‌సైకిల్‌పై పరారయ్యాడు. వారి నుంచి రూ.31 వేల నగదు, మోటార్‌సైకిల్ స్వాధీనం చేసుకున్నారు. కోరుకొండ పోలీసులకు సమాచారం అందించగా వారు కూడా విచారణ జరుపుతున్నారని, కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

పోలవరం లోపాలపై హైకోర్టులో పిల్

అమలాపురం మాజీ ఎంపీ హర్షకుమార్

రాజమహేంద్రవరం సిటీ, జూలై 13 : పోలవరం ప్రాజెక్టు లోపభూయిష్టం కాదని ప్రభుత్వం చెబితే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ సవాల్ చేశారు. రాజమహేంద్రవరం రాజీవ్ గాంధీ విద్యాసంస్థ కాన్ఫరెన్స్ హాలులో శనివారం విలేక రులతో మాట్లాడారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా పోలవరం ప్రాజక్టు కాంట్రాక్టర్లు మారిపోతున్నారన్నారు. ప్రాజెక్టు నిర్మాణంలో చాలా లోపాలు ఉన్నాయన్నారు. పోలవరం ప్రాజెక్టుపై శ్వేతపత్రం విడుదల చేసిన సీఎం చంద్రబాబు ఎంత ఖర్చు పెట్టారు.. ఇంకా ఎంత ఖర్చవుతుందనే విషయాలు ప్రస్తావించలేదన్నారు. లోపాలపై అన్ని వివరాలతో హైకోర్టులో పిల్ వేస్తున్నానని చెప్పారు. సమావేశంలో ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ కమిటీ వ్యవస్థాపకుడు కృష్ణమూర్తి నాయుడు పాల్గొన్నారు.

నేడు రచయితల సమావేశం

రాజమహేంద్రవరం కల్చరల్, జూలై 13: ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాలలో ఆదివారం ఉదయం 10గంటలకు కళాగౌతమి రచయితల సమావేశం జరుగుతుందని కళాగౌతమి అధ్యక్షుడు బీవీబీ.సంజీవరావు శనివారం తెలిపారు. 30 ఏళ్లుగా కళా గౌతమి సంస్థ సాహితీ సేవచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో అనేక సాహిత్య విషయాలు, కవితలు వినే అవకాశం ఉందన్నారు.

17న పెన్షనర్ల సంఘ జిల్లా సమావేశం

రాజమహేంద్రవరం సిటీ, జూలై 13 : రాజమహేంద్రవరం ధర్మంచర కమ్యూనిటీ హాలులో ఈనెల 17న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నామని జిల్లా అధ్యక్షుడు కెజెకె మూర్తి తెలిపారు. ఉదయం 10 గంటలకు సమావేశం ఆరంభమవుతుందని చెప్పారు. సమావేశంలో కార్యదర్శి ఎం.పార్వతి, కోశాధికారి ఎం.పార్వతి, జిల్లా కోశాధికారి జి.నారాయణమూర్తి పాల్గొన్నారు.

అధునాతన సౌకర్యాలు అందిపుచ్చుకోండి

రాజమహేంద్రవరం పోస్టల్ డీఎస్ శేషారావు



బీమా చెక్కును అందజేస్తున్న జీఎస్ఎల్ సూపరింటెండెంట్

రాజానగరం, జూలై 13: తపాలాశాఖలో ప్రవేశపెట్టిన అధునాతన సౌకర్యాలను, నూతన పాలసీలను సద్వినియోగం చేసుకోవాలని రాజమహేంద్రవరం పోస్టల్ డివిజనల్ సూపరింటెండెంట్ కె.శేషారావు పేర్కొన్నారు. రాజమహేంద్రవరం తపాలా డివిజన్, ఇండియా పోస్ట్ చెల్లింపుల బ్యాంకు సమన్వయంతో జీఎస్ఎల్ మెడికల్ కళాశాల, జనరల్ ఆసుపత్రిలో గ్రూప్ యాక్సిడెంట్ గార్డ్(జీఏజీ)గ్యాగ్ పాలసీల అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. శేషారావు మాట్లాడుతూ ఇండియా పోస్ట్ చెల్లింపుల బ్యాంక్ వివిధ బహుళ జాతి బీమా సంస్థల భాగస్వామ్యంతో రూ.555 వార్షిక ప్రీమియంతో ప్రమాద బీమా పాలసీలను సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. దీనిలో భాగంగా రూ.399 అతి తక్కువ ప్రీమియంలో పాలసీ తీసుకుని దురదృష్టవశాత్తూ దేవీపట్నం వద్ద రోడ్డు ప్రమాదంలో మరణించిన పాలసీదారుడు వనుమర్తి రామకృష్ణ నామినీ నాగమణికి, పలాస రైల్వే స్టేషన్‌లో కదులుతున్న రైలులో అకస్మాత్తుగా జారిపడి మరణించిన మరో పాలసీదారుడు బావిశెట్టి నారాయణరావు నామినీ రేవతికి బీమా ప్రయోజన నగదు మొత్తం ఒక్కొక్కరికి రూ.10 లక్షలు వంతున చెక్కు రూపంలో జీఎస్ఎల్ ఆసుపత్రి సూపరిండెంటెండ్ టీవీఎస్పీ మూర్తి, అదనపు మెడికల్ సూపరింటెండ్ ఎం.హరిబాబు చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఇండియా పోస్ట్ చెల్లింపుల బ్యాంక్ రాజమహేంద్రవరం బ్రాంచ్ మేనేజర్ రాజేంద్రనాయుడు, అసిస్టెంట్ మేనేజర్ రేవంత్, ఝాన్సీ, జీఎస్ఎల్ మెడికల్ కళాశాల సబ్‌పోస్ట్ మాస్టర్ వై.లింగయ్య, తపాలా సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాక్టీరియా నిర్మూలనకు డ్రైడే : ఈవోపీఆర్డీ

అనపర్తి, జూలై 13: మంచినీటి ట్యాంకుల నుంచి బ్యాక్టీరియా వ్యాప్తి చెందకుండా శనివారం డ్రైడే కార్యక్రమం నిర్వహించినట్టు ఈవోపీఆర్డీ పద్మజ తెలిపారు. వాటర్ ట్యాంకుల నుంచి బ్యాక్టీరియా ప్రబలకుండా ఉండేందుకు జిల్లా వ్యాప్తంగా అన్ని ఓవర్‌హెడ్ ట్యాంకులను ఒకే సమయంలో శుభ్రపరచాలన్న కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని 29 వాటర్ ట్యాంకులను ఒకే సమయంలో శుభ్రపరిచామన్నారు. ట్యాంక్‌ను ఐదు గంటలు డ్రైగా ఉంచామని అనంతరం ట్యాంక్‌లో క్లోరినేషన్ ప్రక్రియను నిర్వహించామన్నారు.

ప్రజలను చైతన్య పరచాలి.. డయేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా ప్రజలను చైతన్యం చేయవలసిన బాధ్యత వైద్య, అంగన్‌వాడీ సిబ్బందిపై ఉందని ఈవోపీఆర్డీ పద్మజ అన్నారు. శనివారం అనపర్తిలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన అవగాహనా కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. గ్రామాల్లో వైద్య, అంగన్‌వాడీ సిబ్బంది సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించడమే కాకుండా తీసుకోవాల్సిన చర్యలను వివరించాలని సూచించారు.

జంతు వ్యర్థాలను విచ్చలవిడిగా పడేస్తే చర్యలు

అనపర్తి, జూలై 13: కోడి, మేక, చేపల వ్యర్థాలను వర్తకులు ఎక్కడపడితే అక్కడ పడేస్తే కఠిన చర్యలు తప్పవని పంచాయతీ కార్యదర్శి హెచ్చరించారు. శనివారం అనపర్తి మార్కెట్‌లో చికెన్, మటన్ వ్యాపారులకు నోటీసులు జారీ చేశారు. వ్యర్థాలను దూరంగా తరలించాలని లేకుంటే పంచాయతీ ట్రాక్టర్‌కు అందజేయాలన్నారు.

ఆటోడ్రైవర్ నిజాయితీ

ప్రయాణికురాలు మర్చిపోయిన బ్యాగ్ అందజేత



పోలీసుల సమక్షంలో బ్యాగ్‌ను అందజేస్తున్న ఆటోడ్రైవర్ శ్రీనివాస్

ధవళేశ్వరం, జూలై 13: ప్రయాణికులు ఆటోలో మర్చిపోయిన బ్యాగ్‌ను వారికి అందించి ఆటో డ్రైవర్ తన నిజాయితీని నిరూపించుకున్నాడు. రాజమహేంద్రవరంలోని ఒక బ్యాంక్‌లో పని చేస్తున్న కేఎల్ శిరీష శుక్రవారం సాయంత్రం రైల్వేస్టేషన్ వద్ద ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వెళ్లేందుకు ఆటో ఎక్కింది. కాంప్లెక్స్ వద్ద ఆటో దిగే సమయంలో ఒక బ్యాగ్‌ను మర్చిపోయింది. తన కోసం వేచి చూస్తున్న భర్త వద్దకు చేరుకునే సమయంలో బ్యాగ్‌ను ఆటోలో మర్చిపోయినట్టు గుర్తించి ప్రకాష్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ కేవీఎస్ సత్యనారాయణ పరిసరాల్లోని సీసీ ఫుటేజీని పరిశీలించడంతో పాటు వాట్సాప్ గ్రూపుల్లో ఈ విషయాన్ని సర్క్యులేట్ చేశారు. ధవళేశ్వరంలోని కంచర్లలైన్‌కు చెందిన ఆటో డ్రైవర్ కురందాస్ శ్రీనివాస్ తన ఆటోలోనే శిరీష ఎక్కినట్టు గుర్తెరిగి ఆ బ్యాగ్ తన ఆటోలోనే ఉన్నట్టు గుర్తించాడు. స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వచ్చి బ్యాగ్ అందజేశారు. దీంతో ఎస్ఐ వి.క్రాంతికుమార్ ప్రకాష్‌నగర్ సీఐకు సమాచారం అందించారు. శిరీష దంపతులు ధవళేశ్వరం పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని డీఎస్పీ అంబికా ప్రసాద్, ఎస్ఐ క్రాంతికుమార్ సమక్షంలో బ్యాగ్‌ను అందుకుని పరిశీలించారు. బ్యాగ్‌లో ఉంచిన మంగళసూత్రాల గొలుసు, చైన్, బంగారు గాజులు, నల్లపూసల గొలుసు, ఉంగరం భద్రంగా ఉన్నట్టు గుర్తించారు. శ్రీనివాస్ నిజాయితీని అభినందిస్తూ రూ.5 వేలు నగదును అందజేశారు. ఆటో డ్రైవర్‌ను జిల్లా ఎస్పీ జగదీష్‌తోపాటు డీఎస్పీ అభినందించారు.

సినిమా గైడ్

కొవ్వూరు

యువరాజ్‌మాల్ వై.స్ర్కీన్1	కల్కి
వై.స్ర్కీన్2	మహారాజ
దేవిశ్రీ(గాయత్రి)	హరోంహర
అనన్య	తమ్ముడు

నిడదవోలు

వీ మ్యాక్స్	కల్కి
రాధాకృష్ణ	కల్కి
శ్రీగణపతి	భారతీయుడు-2

దేవరపల్లి

శ్రీరామ్ సినీ మ్యాక్స్	కల్కి
శ్రీరామ్ సినీ మ్యాక్స్	కల్కి

నల్లజర్ల

శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ స్ర్కీన్1	భారతీయుడు-2
స్ర్కీన్ 2	కల్కి
శ్రీనివాస	---